@vaartanews @mvnewstv
మీ వార్త
ప్రతి అక్షరం... ప్రజల కోసం
www.mivaartanews.com
TGBIL/25/A0512
AP EDITION
విజయవాడ
గురువారం 12 నవంబర్ 2026
సంపుటి : 2
సంచిక : 260
పేజీలు : 8 వెల : 5/-



తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో
వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న
మీ వార్తన్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను

ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్‌లు,
నియోజకవర్గాల వారీగా ఆర్‌సీ ఇంచార్జీలు,
మండలాల వారీగా విలేకరులు కావలెను.

సీనియర్లకు ప్రాధాన్యం
కొత్తవారికి అవకాశం ఉంటుంది

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



మేధో సంపత్తి వివాదాలకు ఆ హైకోర్టే శరణ్యం అనుకోవడం భ్రమ

- 'ఫోరమ్ షాపింగ్'పై సుప్రీంకోర్టు ఆగ్రహం
- ఫోరమ్ షాపింగ్ లేదా లిటిగేషన్ టూరిజం పోకడలపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం
- కర్ణాటక, తమిళనాడుకు చెందిన సంస్థల వివాదాన్ని ఢిల్లీ హైకోర్టులో దాఖలు చేయడంపై ఆక్షేపణ
- సంబంధిత ఐపీ దావాను ఢిల్లీ నుంచి మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేసిన సుప్రీం ధర్మాసనం
- హైకోర్టుల మధ్య ఎలాంటి అంతరాలు, క్రమానుగత వ్యత్యాసాలు ఉండవని స్పష్టీకరణ



కుల్గామ్‌లో సీఆర్‌పీఎఫ్ శిబిరంపై ఉగ్రదాడి

- ముగ్గురు జవాన్లకు గాయాలు!
- చెక్‌పోస్టు వద్ద మోటార్‌సైకిల్‌పై వచ్చి కాల్పులు.. ఇద్దరి పరిస్థితి విషమం!

ఎత్తిపోతల పథకాలకు జలహారతి



- 789 లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల పునరుద్ధరణకు రూ.632 కోట్లకు పైగా నిధులు
- ఖరీఫ్ ప్రారంభానికి ముందే మరమ్మతులు పూర్తి చేయాలి
- 36 సాగునీటి ప్రాజెక్టులకు రెండున్నరేళ్ల గడువు
- జలహారతి కార్పొరేషన్‌లో ప్రత్యేక విభాగం ఏర్పాటు
- 4,171 ఎకరాల్లో సౌర విద్యుత్ ప్లాంట్లు.. 903.1 మెగావాట్ల ఉత్పత్తికి ప్రణాళిక

అమరావతి:

రాష్ట్రంలో సాగునీటి వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు నిర్వీర్యమైన ఎత్తిపోతల పథకాలకు తిరిగి జీవం పోసేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా పనిచేయకుండా నిలిచిపోయిన 789 ఎత్తిపోతల పథకాలన్నింటినీ పునరుద్ధరించి, వచ్చే జూన్ నాటికి వాటి ద్వారా నీటిని విడుదల చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యేలోగా మరమ్మతులన్నీ పూర్తి - మిగతా3లో



స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఏపీకి ఆరు జాతీయ అవార్డులు!

- రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా పురస్కారాల స్వీకరణ
- ఐదు నగరపాలక సంస్థలు, కుప్పం మున్సిపాలిటీకి గుర్తింపు
- స్వచ్ఛ్ షెహర్ జోడీ విభాగంలో తిరుపతి--కుప్పంకు మూడో స్థానం
- నేషనల్ క్లీన్ సిటీ విభాగంలో విజయవాడకు మూడో ర్యాంకు
- గుంటూరుకూ జాతీయ స్థాయిలో మూడో ర్యాంకు

అమరావతి

పట్టణ పారిశుద్ధ్య నిర్వహణలో ఆంధ్రప్రదేశ్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. స్వచ్ఛ సర్వేక్షణ్ 2025--26 అవార్డుల్లో రాష్ట్రం ఆరు పురస్కారాలను సాధించింది. పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త సేకరణ, వ్యర్థాల ప్రాసెసింగ్ వంటి అంశాల్లో మెరుగైన పనితీరు కనబరిచిన నగరాలు, పట్టణాలకు ఈ అవార్డులు దక్కాయి. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'స్వచ్ఛాంధ్ర--స్వర్ణాంధ్ర' కార్యక్రమాలు, పారిశుద్ధ్య కార్మికుల కృషి, అధికారుల పర్యవేక్షణ ఈ గుర్తింపునకు దోహదపడ్డాయని ప్రభుత్వం పేర్కొంది. దేశ రాజధాని దిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల - మిగతా3లో



రైతులకు కేంద్రం భారీ ఊరట..

- రూ.62,370 కోట్ల ఎరువుల సబ్సిడీకి ఆమోదం!
- రబీ 2026-27 సీజన్‌కు భారీగా నిధుల కేటాయింపు..
- డీఏపీ బస్తా ధర రూ.1,350గానే కొనసాగింపు!
- ముద్రా రుణాలకు మరో ఐదేళ్ల పొడిగింపు..
- స్టాండప్ ఇండియా పథకానికీ గ్రీన్ సిగ్నల్!
- యుగే యుగీన్ మ్యూజియానికి రూ.3,230 కోట్లు..
- నోయిడా మెట్రో విస్తరణకు రూ.2,390 కోట్లు!

రామమందిర విరాళాల లెక్కలు బయటపెట్టాలి

- విరాళాల సేకరణ నుంచి లెక్కింపు వరకు అవకతవకల ఆరోపణలు..
- సమగ్ర దర్యాప్తునకు జైరాం రమేశ్ డిమాండ్!
- 2021లోనే అక్రమాలపై ఫిర్యాదు చేశారంటూ ప్రస్తావన..
- ఫిర్యాదు చేసిన అధికారినే తొలగించారని ఆరోపణ!
- ఎస్ఐటీ నివేదికను ఎందుకు బహిర్గతం చేయడం లేదు?
- మోదీ, యోగి ప్రభుత్వాలపై కాంగ్రెస్ నేత ప్రశ్నలు!





విదేశీయులకు వీసా విధానంలో భారీ మార్పులు

- 13 కేటగిరీలు 9కి కుదింపు!
- ఉప విభాగాలు 49 నుంచి 23కి తగ్గింపు..
- దరఖాస్తు ఫారాల్లో 70 శాతం వరకు ఫీల్డ్స్ తొలగింపు!
- వీసా ప్రక్రియను సరళతరం చేసిన కేంద్ర హోం శాఖ..
- విదేశీ సందర్శకులకు మరింత సులభంగా అనుమతులు!

ఏపీలో 23 పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికల నగారా!



- నేడు మధ్యాహ్నం 12.30 గంటలకు షెడ్యూల్ విడుదల
- న్యాయపరమైన చిక్కులు తొలగడంతో ఎన్నికలకు మార్గం సుగమం
- నాలుగు నగరపాలక సంస్థలు.. 19 మున్సిపాలిటీలకు ఎన్నికలు
- ఇప్పటికే రిజర్వేషన్లు ఖరారు చేసిన ప్రభుత్వం
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ప్రకటన

అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో పెండింగ్‌లో ఉన్న 23 పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు మార్గం సుగమమైంది. న్యాయపరమైన చిక్కులు, వివాదాలు తొలగిపోవడంతో ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధమైంది. గురువారం (నవంబర్ 12) మధ్యాహ్నం 12.30 గంటలకు ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా మీడియా సమావేశంలో ఎన్నికలకు సంబంధించిన వివరాలను వెల్లడించనున్నారు. రాష్ట్రంలో ఇటీవల 100 పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించారు. అయితే వివిధ కారణాలతో 23 పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో శ్రీకాకుళం, కాకినాడ, రాజమహేంద్రవరం, మంగళగిరి--తాడేపల్లి నగరపాలక సంస్థలతో పాటు మరో 19 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు ఉన్నాయి. ఆయా సంస్థలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రిజర్వేషన్లను ఖరారు చేసింది. వార్డుల వారీగా కేటాయింపులు కూడా ప్రకటించింది.

ఏపీలో కొత్త రాజకీయ పార్టీ ఆవిర్భావం!



- 'పరివర్తన రాజనీతి పార్టీ'ని ప్రకటించిన విజయసాయిరెడ్డి
- 'దేశం కోసం.. ధర్మం కోసం' నినాదంతో పీఆర్‌పీ ఏర్పాటు
- కాషాయం, తెలుపు రంగులతో పార్టీ జెండా ఆవిష్కరణ
- వారసత్వ రాజకీయాలకు స్వస్తి పలకాలని పిలుపు
- యువతలో నాయకత్వ లక్షణాలను ప్రోత్సహిస్తామని వెల్లడి
- సీఎం కావాలనే ఆశ లేదని.. యువత నుంచే సీఎం అభ్యర్థి ఎంపిక చేస్తానని ప్రకటన



అయోధ్యలో అద్భుత రామ్ దర్బార్

- 220 టన్నుల ఇసుకతో ప్రపంచ రికార్డు!
- 58 అడుగుల పొడవు.. 20 అడుగుల ఎత్తుతో భారీ సైకత శిల్పం!
- ఏడు రోజుల పాటు శ్రమించిన కళాకారుడు మధురేంద్ర కుమార్ బృందం..
- బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు!
- సరయూ తీరంలో కనువిందు చేస్తున్న రామమందిర నమూనా..

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఏపీ నగరాల హవా.. విశాఖకు అగ్రతాంబూలం

- స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26 ర్యాంకింగ్స్
- 10 లక్షల జనాభా కేటగిరీలో గ్రేటర్ విశాఖకు మొదటి స్థానం
- దేశంలోనే 3వ అత్యంత స్వచ్ఛమైన నగరంగా విజయవాడ
- 3 నుంచి 10 లక్షల జనాభా విభాగంలో గుంటూరుకు 3వ ర్యాంకు
- దేశంలోనే అత్యంత స్వచ్ఛమైన నగరంగా నవీ ముంబై ఎంపిక



రైతులకు కేంద్రం భారీ ఊరట

న్యూఢిల్లీ: రైతులు, చిన్న వ్యాపారవేత్తలకు ప్రయోజనం కల్పించేలా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. రబీ 2026-27 సీజన్‌లో రైతులకు ఎరువులపై సబ్సిడీ అందించేందుకు రూ.62,370 కోట్లు కేటాయించడానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అంతర్జాతీయ పరిణామాలతో ఎరువుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో రైతులపై అదనపు భారం పడకుండా ఈ నిర్ణయం తీసుకుంది. ముఖ్యంగా 50 కిలోల డీఏపీ బస్తా ధరను గతంలో మాదిరిగానే రూ.1,350గా కొనసాగించనున్నట్లు కేంద్రం స్పష్టం చేసింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో వ్యవసాయం, సూక్ష్మ పరిశ్రమలు, మహిళా పారిశ్రామికవేత్తలు, మౌలిక సదుపాయాలకు సంబంధించి పలు కీలక ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. సమావేశం అనంతరం కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ నిర్ణయాల వివరాలను వెల్లడించారు.

ఎరువుల సబ్సిడీకి రూ.62,370 కోట్లు

రబీ 2026-27 సీజన్‌కు సంబంధించి ఫాస్ఫేటిక్, పొటాషిక్ ఎరువులపై రూ.62,370 కోట్ల సబ్సిడీ అందించేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభం, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ఎరువుల ధరలు పెరిగాయని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఈ పరిస్థితుల్లో రైతులకు ఎరువులు అందుబాటు ధరల్లో లభించేలా సబ్సిడీ కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. డీఏపీతో పాటు ఇతర ఫాస్ఫేటిక్, పొటాషిక్ ఎరువులపై పోషకాల ఆధారిత సబ్సిడీ (ఎన్‌బీఎస్) విధానం ప్రకారం రాయితీలు అందించనున్నారు. దీనివల్ల అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు పెరిగినా దేశీయ రైతులపై ఆ ప్రభావం పరిమితంగా ఉండే అవకాశం ఉంది. ముఖ్యంగా డీఏపీ 50 కిలోల బస్తా ధర రూ.1,350గానే కొనసాగుతుందని కేంద్రం స్పష్టం చేసింది.

ముద్రా రుణాలకు మరో ఐదేళ్ల గడువు

సూక్ష్మ పరిశ్రమలకు ఆర్థిక భరోసా కల్పించే క్రెడిట్ గ్యారెంటీ ఫండ్ ఫర్ మైక్రో యూనిట్స్ (సీజీఎఫ్ఎంయూ) పథకాన్ని మరో ఐదేళ్లపాటు పొడిగించేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం



తెలిపింది. ఈ పథకం 2031 మార్చి వరకు కొనసాగనుంది. ప్రధానమంత్రి ముద్రా యోజన కింద బ్యాంకులు, ఆర్థిక సంస్థలు అందించే రుణాలకు క్రెడిట్ గ్యారెంటీ రక్షణ కల్పించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. రుణగ్రహీతలు తిరిగి చెల్లించలేని పరిస్థితుల్లో రుణ సంస్థలకు కలిగే నష్టభారాన్ని తగ్గించేందుకు ఈ గ్యారెంటీ ఉపయోగపడుతుంది. 2016లో ముద్రా యోజన ప్రారంభమైనప్పటి నుంచి 2026 సెప్టెంబర్ వరకు 60.36 కోట్లకు పైగా రుణాలు మంజూరయ్యాయి. వీటి మొత్తం విలువ రూ.43.34 లక్షల కోట్లుగా ఉంది. ఈ పథకం కొనసాగింపునకు రూ.5,000 కోట్ల నిధులు కేటాయించేందుకు కేబినెట్ ఆమోదించింది. తద్వారా రానున్న కాలంలో రూ.12.6 లక్షల కోట్ల విలువైన ముద్రా రుణాలకు మద్దతు లభించనుంది.

స్టాండప్ ఇండియాకు మరో ఐదేళ్లు

మహిళలు, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే స్టాండప్ ఇండియా పథకాన్ని కూడా మరో ఐదేళ్లపాటు పొడిగించారు. 2031 మార్చి 31 వరకు ఈ పథకం అమల్లో ఉండనుంది. ఈ పథకం ద్వారా రానున్న ఐదేళ్లలో అదనంగా 2.5 లక్షల మంది పారిశ్రామికవేత్తలకు ఆర్థిక సహాయం అందించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. 2016 ఏప్రిల్‌లో ప్రారంభమైన ఈ పథకం ద్వారా ఇప్పటివరకు 2.75 లక్షల మందికి పైగా మహిళలు, ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి రుణాలు అందాయి. కొత్తగా గ్రీన్‌ఫీల్డ్ సంస్థలను ఏర్పాటు చేయాలనుకునే వారికి రూ.10 లక్షల నుంచి రూ.1 కోటి వరకు రుణాలు అందిస్తారు. తయారీ, సేవలు, వాణిజ్యం, వ్యవసాయ అనుబంధ రంగాల్లో వ్యాపారాలు ప్రారంభించేందుకు ఈ రుణాలు ఉపయోగపడతాయి. ప్రతి షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకు శాఖ కనీసం ఒక ఎస్సీ లేదా ఎస్టీ వ్యాపారవేత్తకు, ఒక మహిళా వ్యాపారవేత్తకు రుణం అందించాలన్నది ఈ పథకం లక్ష్యం. ఈ రుణాలకు గరిష్ఠంగా 18 నెలల మారటోరియం సదుపాయం ఉంటుంది. రుణాన్ని ఏడేళ్లలోపు తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. రుణ మొత్తంలో 85 శాతం వరకు క్రెడిట్ గ్యారెంటీ సదుపాయం కల్పిస్తారు.

యుగే యుగీన్ మ్యూజియానికి రూ.3,230 కోట్లు

దేశ చరిత్ర, సంస్కృతి, వారసత్వ సంపదను భవిష్యత్ తరాలకు పరిచయం చేసే లక్ష్యంతో యుగే యుగీన్ మ్యూజియం అభివృద్ధికి రూ.3,230 కోట్లు కేటాయించేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఢిల్లీలోని చారిత్రక నార్త్ బ్లాక్, సౌత్ బ్లాక్ భవనాలను మ్యూజియం ప్రాంగణంగా అభివృద్ధి చేయనున్నారు. దేశ చరిత్రకు సంబంధించిన ముఖ్యమైన ఘట్టాలు, కళలు, సంస్కృతి, వారసత్వ సంపదను ఒకే చోట ప్రదర్శించేలా ఈ ప్రాజెక్టును రూపొందించనున్నారు.

నోయిడా మెట్రోకు రూ.2,390 కోట్లు

ఉత్తరప్రదేశ్‌లో మెట్రో రైలు కనెక్టివిటీని మరింత విస్తరించేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. నోయిడా సెక్టార్-51 నుంచి గ్రేటర్ నోయిడాలోని సెక్టార్-4 వరకు మెట్రో మార్గాన్ని నిర్మించేందుకు రూ.2,390 కోట్ల వ్యయంతో ప్రతిపాదించిన ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మార్గం అందుబాటులోకి వస్తే నోయిడా, గ్రేటర్ నోయిడా మధ్య ప్రయాణించే ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడనున్నాయి. ముఖ్యంగా ఉద్యోగులు, విద్యార్థులు, రోజువారీ ప్రయాణికులకు ప్రయోజనం చేకూరనుంది. రైతులకు ఎరువుల ధరల భారం తగ్గించడం, చిన్న వ్యాపారాలకు రుణ భరోసా కల్పించడం, మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం, పట్టణ రవాణా సదుపాయాలను విస్తరించడం వంటి పలు అంశాలకు కేంద్ర కేబినెట్ నిర్ణయాల్లో ప్రాధాన్యం లభించింది.

విదేశీయులకు వీసా విధానంలో భారీ మార్పులు

న్యూఢిల్లీ: భారత్‌ను సందర్శించాలనుకునే విదేశీ పౌరులకు కేంద్ర ప్రభుత్వం కీలక వెసులుబాటు కల్పించింది. దేశ వీసా విధానంలో సమూల మార్పులు చేస్తూ వీసా కేటగిరీల సంఖ్యను తగ్గించింది. ఇప్పటివరకు ఉన్న 13 ప్రధాన వీసా విభాగాలను 9కి, 49 ఉప విభాగాలను 23కి కుదించింది. అంతేకాకుండా వీసా దరఖాస్తు ఫారాల్లోనూ భారీగా మార్పులు చేసింది. దరఖాస్తుదారులు వివరాలు నమోదు చేసే ఫీల్డ్స్ సంఖ్యను 65 నుంచి 70 శాతం వరకు తగ్గించినట్లు అధికారులు బుధవారం వెల్లడించారు.

9 ప్రధాన వీసా కేటగిరీలు ఇవే

కొత్త విధానంలో వీసాలను ప్రయాణ ఉద్దేశాలకు అనుగుణంగా తొమ్మిది ప్రధాన విభాగాలుగా వర్గీకరించారు.

1. బిజినెస్ వీసా -- వ్యాపార కార్యకలాపాలు, పెట్టుబడులు.
2. డిప్లొమాటిక్ వీసా -- దౌత్య సంబంధిత పర్యటనలు.
3. వర్క్ వీసా -- ఉద్యోగ, ఉపాధి అవసరాలు.
4. జర్నలిస్ట్ వీసా -- పాత్రికేయ కార్యకలాపాలు.
5. మెడికల్ వీసా -- వైద్య చికిత్స.
6. అఫీషియల్ వీసా -- అధికారిక పర్యటనలు.
7. స్టూడెంట్ వీసా -- విద్య, పరిశోధన.
8. విజిటర్ వీసా -- పర్యాటకం, ఇతర స్వల్పకాలిక సందర్శనలు.
9. మిసిలేనియస్ వీసా -- ఇతర ప్రత్యేక అవసరాలు.

టూరిస్ట్ వీసా స్థానంలో విజిటర్ వీసా

కొత్త విధానంలో టూరిస్ట్ వీసా పేరును విజిటర్ వీసాగా మార్చారు. దీన్ని ఎ-1, ఎ-2 అనే రెండు ఉప విభాగాలుగా



విభజించారు. ఎ-1 వీసా ద్వారా పర్యాటకంతో పాటు వ్యాపార సమావేశాలు, వైద్య సంప్రదింపులు, వెల్‌నెస్ కార్యక్రమాలు, స్వల్పకాలిక కోర్సులకు వెళ్లవచ్చు. ఇది 30 రోజుల కాలపరిమితితో మల్టిపుల్ ఎంట్రీ సదుపాయంతో ఉంటుంది.

ఎ-2 వీసా దీర్ఘకాలిక సందర్శనల కోసం ఉద్దేశించారు. నిబంధనల ప్రకారం ఒకటి, ఐదు లేదా పదేళ్ల కాలపరిమితితో ఈ వీసా జారీ చేస్తారు. పర్వతారోహణకు సంబంధించిన సందర్శనలకూ ఇందులో అవకాశం కల్పించారు.

వైద్య, విద్యార్థి వీసాల్లోనూ మార్పులు

వైద్య చికిత్స కోసం వచ్చే విదేశీయులకు వీసా విధానాన్ని మరింత స్పష్టంగా రూపొందించారు. సాధారణ వైద్య చికిత్సలకు వీ-1, ఆయుష్ వైద్య విధానాల చికిత్సకు వీ-3 వీసాలను కేటాయించారు. రోగులతో పాటు వచ్చే సహాయకుల కోసం వీ-2, వీ-4 వీసా విభాగాలను ఏర్పాటు చేశారు. ఈ వీసాలకు సాధారణంగా ఏడాది కాలపరిమితితో మల్టిపుల్ ఎంట్రీ సదుపాయం ఉంటుంది.

విద్యార్థి వీసాలను ఎ-1, ఎ-2గా విభజించారు. పాఠశాల విద్య నుంచి డిగ్రీ, పీజీ చదువుల వరకు ఎ-1 వర్తిస్తుంది. పీహెచ్‌డీ, పరిశోధకులు, విజిటింగ్ ఫ్యాకల్టీ, ఇంటర్న్‌షిప్‌లు, ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్‌లకు ఎ-2 వర్తిస్తుంది.

బిజినెస్ వీసాలకూ ప్రత్యేక విభజన

వ్యాపార అవసరాల కోసం భారత్‌కు వచ్చే విదేశీయులకు వీ-1, వీ-2 విభాగాలను రూపొందించారు. దీర్ఘకాలిక వ్యాపార కార్యకలాపాలు, పరిశ్రమల స్థాపన వంటి అవసరాలకు వీ-1 వీసా ఉపయోగపడుతుంది. స్వల్పకాలిక ఒప్పందాలు, సమావేశాలు, క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు, సినిమా నిర్మాణం వంటి కార్యకలాపాలకు వీ-2 వీసా వర్తిస్తుంది.

భారతీయ కంపెనీలకు అవసరమైన విదేశీ సాంకేతిక నిపుణులు, ఇంజినీర్లు, ప్రత్యేక నైపుణ్యాలు కలిగిన సిబ్బంది సేవలను వినియోగించుకునేందుకు కూడా ప్రత్యేక వెసులుబాటు కల్పించారు.

ఏడాది చివరి నుంచి కొత్త విధానం అమలు

వీసా విధానంలో చేసిన మార్పులను అమలు చేసేందుకు కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ తన ఐటీ వ్యవస్థలను ఆధునీకరిస్తోంది. 2026 ఏడాది చివరి నాటికి కొత్త విధానం ప్రకారం వీసాల జారీ ప్రక్రియ ప్రారంభం కానుందని కేంద్రం వెల్లడించింది. ఈ మార్పులతో విదేశీ పర్యాటకులు, వైద్య సేవల కోసం వచ్చే వారు, విద్యార్థులు, పెట్టుబడిదారులు, వ్యాపారవేత్తలకు దరఖాస్తు ప్రక్రియ మరింత సులభతరం కానుంది.

అయోధ్యలో అద్భుత రామ్ దర్బార్

అయోధ్య: రామనామ స్మరణతో మారుమోగుతున్న అయోధ్యలో మరో అద్భుత కళాఖండం ఆవిష్కృతమైంది. 2026 దీపోత్సవ వేడుకల్లో భాగంగా సరయూ నదీ తీరంలో నిర్మించిన భారీ రామ్ దర్బార్ సైకత శిల్పం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఏకంగా 220 టన్నుల ఇసుకతో 58 అడుగుల పొడవు, 20 అడుగుల ఎత్తులో రూపొందించిన ఈ అద్భుత కళాకృతికి 'బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్' అధికారిక గుర్తింపు లభించింది. అంతర్జాతీయ సైకత శిల్పి మధురేంద్ర కుమార్ తన బృందంతో కలిసి ఈ అరుదైన శిల్పాన్ని రూపొందించారు.



220 టన్నుల ఇసుకతో అద్భుత సృష్టి

ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం, రాష్ట్ర పర్యాటక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో అయోధ్యలోని రామ్ కథా పార్క్‌లో ఈ భారీ శిల్పాన్ని నిర్మించారు. సరయూ నది నుంచి సేకరించిన 220 టన్నుల ఇసుకను ఇందుకోసం వినియోగించారు. రామమందిర నమూనాతో పాటు రాముడు, సీత, లక్ష్మణుడు, హనుమంతుడితో కూడిన రామ్ దర్బార్‌ను అత్యంత నైపుణ్యంతో తీర్చిదిద్దారు. ప్రపంచ శాంతి, మానవత్వం, సోదరభావం సందేశాలను ప్రతిబింబించేలా ఈ కళాఖండాన్ని రూపొందించారు.

ఏడు రోజులపాటు నిర్విరామంగా నిర్మాణం

అక్టోబర్ 30న ప్రారంభమైన శిల్ప నిర్మాణ పనులు నవంబర్ 7 వరకు ఏడు రోజులపాటు కొనసాగాయి. భారీ పరిమాణంలో ఇసుకను ఉపయోగించి సున్నితమైన ఆకృతులను చెక్కడం కళాకారులకు పెద్ద సవాలుగా మారింది. అయినప్పటికీ మధురేంద్ర కుమార్ బృందం పట్టుదలతో పనులను పూర్తి చేసింది. రామ్ దర్బార్ ఇతివృత్తంతో తాను రూపొందించిన తొలి భారీ సైకత శిల్పం ఇదేనని మధురేంద్ర కుమార్ వెల్లడించారు. ఈ స్థాయిలో పొడవైన రామ్ దర్బార్ శిల్పాన్ని ఇసుకతో నిర్మించడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు.

బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో గుర్తింపు

ఈ భారీ కళాఖండానికి సంబంధించిన వివరాలను అక్టోబర్ 30న బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సంస్థలకు సమర్పించారు. నవంబర్ 7న బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ నుంచి అధికారిక ఆమోదం లభించింది. ×చీన/2026/001810 రికార్డు నంబరుతో గుర్తింపు నమోదు చేసి డిజిటల్ సర్టిఫికెట్ జారీ చేశారు. గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ గుర్తింపు ప్రక్రియ మాత్రం ఇంకా కొనసాగుతోంది.

ప్రముఖుల ప్రశంసలు

దీపోత్సవ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ఉత్తరప్రదేశ్ గవర్నర్ ఆనందీబెన్ పటేల్, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఈ భారీ శిల్పాన్ని సందర్శించారు. కళాకారుల నైపుణ్యాన్ని పరిశీలించి అభినందించారు. ఈ చారిత్రక కళాఖండాన్ని అయోధ్య ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రశంసించారు. ఉపరాష్ట్రపతి సైతం శిల్పకళా నైపుణ్యాన్ని కొనియాడారు.

12కు పైగా ప్రపంచ రికార్డుల సృష్టికర్త

బిహార్‌లోని తూర్పు చంపారన్‌కు చెందిన మధురేంద్ర కుమార్ ఇప్పటికే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన సైకత శిల్పి. ఇప్పటివరకు 25కు పైగా దేశాల్లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించారు. 12కు పైగా ప్రపంచ రికార్డులు సాధించారు. ఇసుకతో పాటు బొగ్గు బూడిద, ఆకులు, పండ్లు, కూరగాయలు, పునర్వినియోగ వస్తువులతో వేలాది కళాఖండాలను రూపొందించారు. అమెరికా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ నుంచి ఇసుక కళలో గౌరవ డాక్టరేట్ కూడా అందుకున్నారు. పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత, వ్యసన విముక్తి, ప్రపంచ శాంతి వంటి అంశాలను తన కళాఖండాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లడం ఆయన ప్రత్యేకత.

30 లక్షలకు పైగా దీపాలతో అయోధ్య వెలుగులు

మరోవైపు 2026 దీపోత్సవ వేడుకలు అయోధ్యలో అంగరంగ వైభవంగా జరిగాయి. సరయూ నదీ తీరంలోని 56 ఘాట్లలో 30 లక్షలకు పైగా మట్టి ప్రమిదలను వెలిగించి దీపాల కాంతులతో నగరాన్ని అలంకరించారు. పదో దీపోత్సవ వేడుకలు భక్తి, ఆధ్యాత్మిక శోభ మధ్య ఘనంగా నిర్వహించారు. రామమందిర నిర్మాణం అనంతరం అయోధ్యకు పెరుగుతున్న అంతర్జాతీయ గుర్తింపులో ఇలాంటి కళాఖండాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. సంప్రదాయం, కళానైపుణ్యం, ఆధ్యాత్మికత కలగలిసిన ఈ భారీ రామ్ దర్బార్ శిల్పం పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఏపీ నగరాల హవా..

విశాఖకు అగ్రతాంబూలం

కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన 'స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26' వార్షిక సర్వేలో ఆంధ్రప్రదేశ్ నగరాలు ఘన విజయం సాధించాయి. దేశవ్యాప్త స్వచ్ఛతా ర్యాంకింగ్స్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు నగరాలు జాతీయ స్థాయిలో పురస్కారాలను కైవసం చేసుకున్నాయి. ఓవరాల్ విభాగంలో విజయవాడ దేశంలోనే మూడో అత్యంత స్వచ్ఛమైన నగరంగా నిలిచింది. న్యూఢిల్లీలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విజేతలకు అవార్డులను అందజేశారు. వివిధ జనాభా వర్గాల వారీగా ప్రకటించిన ర్యాంకింగ్స్‌లోనూ ఏపీ నగరాలు ముందంజలో నిలిచాయి. 10 లక్షలకు పైగా జనాభా కలిగిన నగరాల విభాగంలో గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ దేశంలోనే ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుని అగ్రగామిగా నిలిచింది. ఈ విభాగంలో మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ రెండో స్థానంలో, ఉత్తరప్రదేశ్‌లోని లక్నో మూడో స్థానంలో నిలిచాయి. అలాగే 3 లక్షల నుంచి 10 లక్షల లోపు జనాభా ఉన్న నగరాల కేటగిరీలో గుంటూరు నగరం జాతీయ స్థాయిలో మూడో స్థానాన్ని దక్కించుకుంది. ఈ కేటగిరీలో ఉజ్జయిని మొదటి స్థానం, చండీగఢ్ రెండో స్థానం సాధించాయి. ఓవరాల్ ర్యాంకింగ్స్ పరిశీలిస్తే.. మహారాష్ట్రకు చెందిన నవీ ముంబై దేశంలోనే అత్యంత స్వచ్ఛమైన నగరంగా మొదటి స్థానాన్ని దక్కించుకుంది. గుజరాత్‌కు చెందిన సూరత్ రెండో స్థానంలో నిలవగా, విజయవాడ మూడో స్థానాన్ని సొంతం చేసుకుంది. గత ఎనిమిదేళ్లుగా స్వచ్ఛ నగరాల ర్యాంకింగ్స్‌లో మొదటి స్థానంలో నిలుస్తూ వచ్చిన మధ్యప్రదేశ్‌కు చెందిన ఇండోర్ నగరం ఈసారి టాప్ స్థానాల్లో చోటు దక్కించుకోలేకపోవడం గమనార్హం. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్ 10వ ఎడిషన్ (సూపర్ స్వచ్ఛ లీగ్)లో భాగంగా దేశవ్యాప్తంగా సుమారు 4,751 నగరాల్లో ఈ సర్వే చేపట్టారు. గత ఏడాది సూపర్ స్వచ్ఛ లీగ్‌లో ఇండోర్ మొదటి స్థానంలో, సూరత్ రెండో స్థానంలో, నవీ ముంబై మూడో స్థానంలో నిలిచాయి. ఇతర విభాగాల ఫలితాలు చూస్తే.. రివర్‌ఫ్రంట్ నగరాల విభాగంలో మధ్యప్రదేశ్‌కు చెందిన రేవా మొదటి స్థానంలో, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన బిలాస్‌పూర్ రెండో స్థానంలో, ఉత్తరప్రదేశ్‌కు చెందిన వారణాసి మూడో స్థానంలో నిలిచాయి. తీరప్రాంత పట్టణాల కేటగిరీలో ఒడిశాకు చెందిన పూరీ అగ్రస్థానంలో నిలవగా, కేరళకు చెందిన అలప్పుళ రెండో స్థానం, మహారాష్ట్రకు చెందిన రత్నగిరి మూడో స్థానం పొందాయి. హిమాలయ ప్రాంత నగరాల విభాగంలో ఉత్తరాఖండ్‌కు చెందిన రుద్రపూర్ ప్రథమ స్థానాన్ని, జమ్ము ద్వితీయ స్థానాన్ని దక్కించుకున్నాయి. దేశవ్యాప్త పోటీలో విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు నగరాలు అగ్రశ్రేణిలో నిలిచి రాష్ట్ర ప్రతిష్ఠను జాతీయ స్థాయిలో మరింత పెంచాయి.

మేధో సంపత్తి వివాదాలకు ఆ హైకోర్టే శరణ్యం అనుకోవడం భ్రమ..

తమకు అనుకూలమైన న్యాయస్థానాలను ఎంచుకుంటూ పిటిషన్లు దాఖలు చేసే 'ఫోరమ్ షాపింగ్' (లేదా లిటిగేషన్ టూరిజం) ధోరణిపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. సాంకేతిక పరిధి ఉందన్న ఏకైక కారణంతో సుదూర ప్రాంతాల్లోని హైకోర్టులను ఆశ్రయించడం సరైంది కాదని స్పష్టం చేసింది. మేధో సంపత్తి హక్కుల (ఐపీ) వివాదానికి సంబంధించి ఢిల్లీ హైకోర్టులో నడుస్తున్న ఒక వాణిజ్య దావాను మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేస్తూ జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసుకు సంబంధించి బెంగళూరు రూరల్ జిల్లా నెలమంగళకు చెందిన 'మెసర్స్ శ్రీ లక్ష్మీ శ్రీనివాస ఆగ్రో ఫుడ్స్', ఇతర సంస్థలు వాది (ప్లైంటిఫ్) పక్షంగా ఢిల్లీ హైకోర్టులో వాణిజ్య దావా కింద(జూవీవీ) 625/2026ని వేశాయి. చెన్నైకి చెందిన 'సాయి మహాలక్ష్మి ట్రేడర్స్' సహా మరికొందరు ప్రతివాదులుగా ఉన్నారు. అయితే, ఇరు పక్షాలు పోరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడుకు చెందినవే అయినప్పుడు కేసును ఢిల్లీలో ఎందుకు దాఖలు చేశారో తమకు అర్థం కావడం లేదని సుప్రీంకోర్టు పేర్కొంది. కేసును చెన్నైకి బదిలీ చేయాలంటూ ప్రతివాదులు దాఖలు చేసిన పిటిషన్‌ను అనుమతిస్తూ ధర్మాసనం తీర్పు వెలువరించింది. విచారణ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ.. వివిధ కోర్టులకు ప్రాదేశిక అధికార పరిధి ఉన్నంత మాత్రాన, పిటిషనర్లు తమకు నచ్చిన న్యాయస్థానాన్ని ఎంచుకునే 'ఫోరమ్ షాపింగ్' విధానాన్ని సమర్థించుకోలేరని తేల్చిచెప్పింది. ఇలాంటి చర్యలు దేశంలోని హైకోర్టుల మధ్య అంతరాలు ఉన్నాయనే తప్పుడు భావనను పెంచుతాయని వ్యాఖ్యానించింది. ముఖ్యంగా మేధో సంపత్తి, వాణిజ్య వివాదాలను విచారించడానికి ఒక నిర్దిష్ట హైకోర్టు (ఢిల్లీ హైకోర్టు వంటివి) మాత్రమే అత్యుత్తమమైనదనే ఆలోచన పూర్తిగా తప్పు అని, అది తప్పుడు అవగాహనతో కూడుకున్నదని స్పష్టం చేసింది. వివాదం ఎక్కడైతే మొదలైందో, ఇరు పక్షాలు ఎక్కడైతే ఉన్నాయో ఆ ప్రాంతంలోని న్యాయస్థానాలే కేసులోని వాస్తవాలను సమగ్రంగా అర్థం చేసుకోగలవని కోర్టు అభిప్రాయపడింది. మద్రాస్ హైకోర్టుకు స్వయంగా సివిల్ విచారణ చేపట్టే ఒరిజినల్ జ్యూరిస్‌డిక్షన్ ఉన్న విషయాన్ని గుర్తుచేసింది. ఈ క్రమంలోనే సదరు కేసును తక్షణమే మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేయాలని ఆదేశించింది. ఇరు పక్షాల ప్రతినిధులు కోర్టుకు నేరుగా గానీ లేదా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గానీ హాజరు కావచ్చని తెలిపింది. వాణిజ్య వివాదాల్లో ఢిల్లీ హైకోర్టును మాత్రమే ప్రాధాన్య వేదికగా భావించి ఇతర రాష్ట్రాల వారు సైతం అక్కడికే వెళ్లే పోకడలపై గతంలో ఢిల్లీ హైకోర్టు కూడా ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో, సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ ఆదేశాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

రామమందిర విరాళాల లెక్కలు బయటపెట్టాలి..

న్యూఢిల్లీ: అయోధ్య రామమందిర విరాళాల వ్యవహారం మరోసారి రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఆలయానికి వచ్చిన విరాళాల దుర్వినియోగంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఆరోపణలు చేసింది. విరాళాల సేకరణ, లెక్కింపు, బ్యాంకు ఖాతాల్లో జమ చేసే ప్రక్రియతో పాటు ఆలయ నిర్మాణ పనుల్లోనూ అవకతవకలు జరిగాయనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేసింది. ఈ వ్యవహారంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్), బీజేపీ, విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ)కు చెందిన వ్యక్తుల పాత్రపైనా దర్యాప్తు జరగాలని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ కోరారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పలు ప్రశ్నలు సంధించారు.

ముందే ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదా?

2021లోనే ఆలయ విరాళాల లెక్కల్లో అవకతవకలు జరుగుతున్నాయని అప్పటి ఖాతాల అధికారి మహిపాల్ సింగ్ గుర్తించి, ట్రస్టు ప్రతినిధులు చంపత్ రాయ్, గోపాల్ రావు దృష్టికి తీసుకెళ్లినట్లు మీడియా కథనాలు వెల్లడించాయని జైరాం రమేశ్ పేర్కొన్నారు. అయితే అక్రమాలను ప్రశ్నించిన అధికారినే విధుల నుంచి తొలగించారని ఆరోపించారు. ఆలయ నిర్మాణ పనులను పర్యవేక్షించిన ఇంజినీర్ దినానాథ్ వర్మ కూడా ట్రస్టు కార్యాలయంలో పనుల కోసం 40 శాతం కమీషన్ డిమాండ్ చేశారని ఆరోపించినట్లు జైరాం ప్రస్తావించారు. ఇందుకు సంబంధించిన ఆడియో రికార్డింగ్‌ను చంపత్ రాయ్‌కు వినిపించిన తర్వాత తననే ప్రాజెక్టు నుంచి తొలగించారని వర్మ చెప్పినట్లు మీడియా కథనాలను ఉటంకించారు. ఈ ఆరోపణలపై ట్రస్టు ప్రతినిధులు ఎలాంటి చర్యలు తీసుకున్నారో వెల్లడించాలని ప్రశ్నించారు.

కుల్గామ్‌లో సీఆర్‌పీఎఫ్ శిబిరంపై ఉగ్రదాడి

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో మరోసారి ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. కుల్గామ్ జిల్లాలోని సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) శిబిరం సమీపంలోని చెక్‌పోస్టుపై బుధవారం దాడి చేశారు. మోటార్‌సైకిల్‌పై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు భద్రతా సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ముగ్గురు సీఆర్‌పీఎఫ్ జవాన్లు గాయపడ్డారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. గాయపడిన వారిని వెంటనే అనంతనాగ్ జిల్లాలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

మధ్యాహ్నం 2.15 గంటలకు కాల్పులు

అధికారుల వివరాల ప్రకారం.. బుధవారం మధ్యాహ్నం సుమారు 2.15 గంటల సమయంలో మోటార్‌సైకిల్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు కుల్గామ్‌లోని సీఆర్‌పీఎఫ్ నాకా వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బందిపై అకస్మాత్తుగా కాల్పులు జరిపారు. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది ఎదురుకాల్పులు జరపడంతో దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. ఈ దాడిలో 46వ సీఆర్‌పీఎఫ్ బెటాలియన్‌కు చెందిన ముగ్గురు సిబ్బంది గాయపడినట్లు అధికారులు వెల్లడించారు.

ఎత్తిపోతల పథకాలకు జలహారతి..

-మొదటిపేజీ తరువాయి

చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రాధాన్యంగా గుర్తించిన 36 సాగునీటి ప్రాజెక్టులను వచ్చే రెండున్నరేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. ప్రాజెక్టుల నిర్మాణానికి నిధుల కొరత రానివ్వబోమని, పనుల్లో జాప్యం జరగకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో జలవనరుల శాఖ ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణ, నిర్వహణ, సాగునీటి ప్రాజెక్టుల పురోగతి, సౌర విద్యుత్ ఉత్పత్తి అవకాశాలపై చర్చించారు.

789 ఎత్తిపోతల పథకాలకు పునరుజ్జీవం

రాష్ట్రంలో నిలిచిపోయిన 789 ఎత్తిపోతల పథకాలను పునరుద్ధరించేందుకు సుమారు రూ.632.07 కోట్లు అవసరమవుతాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ పథకాలను తిరిగి అందుబాటులోకి తీసుకువస్తే సుమారు 7.49 లక్షల ఎకరాలకు సాగునీటి సదుపాయం కల్పించవచ్చని తెలిపారు. మరమ్మతులకు సంబంధించి క్షేత్రస్థాయి పరిశీలనను త్వరితగతిన పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. అంచనాలు సిద్ధమైన వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని, ఖరీఫ్ సీజన్ నాటికి రైతులకు నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

జలహారతి కార్పొరేషన్‌లో ప్రత్యేక విభాగం

ఎత్తిపోతల పథకాల నిర్వహణకు తాత్కాలిక చర్యలు కాకుండా శాశ్వత వ్యవస్థ ఉండాలని చంద్రబాబు సూచించారు. జలహారతి కార్పొరేషన్ ద్వారా ఈ పథకాల పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ఇందుకోసం కార్పొరేషన్‌లో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని తెలిపారు. అవసరాన్ని బట్టి ప్రతి జిల్లాకు ఒక చీఫ్ ఇంజినీర్ లేదా సూపరింటెండింగ్ ఇంజినీర్‌ను నియమించే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. పథకాల పనితీరు, నిర్వహణ, మరమ్మతులపై నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

36 ప్రాజెక్టులకు రెండున్నరేళ్ల గడువు

రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యంగా గుర్తించిన 36 సాగునీటి ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వచ్చే రెండున్నరేళ్లలో వాటిని పూర్తి చేసేలా స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రాజెక్టుల వారీగా పనుల పురోగతి, అవసరమైన నిధులు,



ఎదురవుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు సమీక్షించాలని తెలిపారు. నిధుల కొరత కారణంగా పనులు నిలిచిపోకుండా అవసరమైన ఆర్థిక వనరులు సమకూరుస్తామని స్పష్టం చేశారు.

4,171 ఎకరాల్లో సౌర విద్యుత్ ప్లాంట్లు

జలవనరుల శాఖ పరిధిలో అందుబాటులో ఉన్న భూములను సౌర విద్యుత్ ఉత్పత్తికి వినియోగించుకునే అవకాశాలపైనా సమావేశంలో చర్చించారు. శాఖ పరిధిలో మొత్తం 5,565 ఎకరాల భూమి ఉండగా, అందులో 4,061 ఎకరాలను సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఈ భూముల ద్వారా 877.3 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చని వివరించారు. ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పరిధిలోని 84 ప్రాంతాల్లో 110 ఎకరాలను సౌర విద్యుత్ ప్లాంట్లకు వినియోగించవచ్చని గుర్తించారు. వీటి ద్వారా మరో 25.8 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉందని తెలిపారు. మొత్తంగా 4,171 ఎకరాల్లో ప్లాంట్లు ఏర్పాటు చేస్తే 903.1 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సాధ్యమవుతుందని అధికారులు వెల్లడించారు.

కాలువలపైనా సౌర, జల విద్యుత్ ఉత్పత్తి

శాఖ భూములతో పాటు కాలువలపై కూడా సౌర విద్యుత్ ఉత్పత్తి అవకాశాలను పరిశీలించాలని చంద్రబాబు సూచించారు. సాగు సీజన్‌లో ఎత్తిపోతల పథకాలకు నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. అవసరానికి మించి ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను గ్రిడ్‌కు సరఫరా చేసి ఆదాయం పొందే అవకాశాలను అధ్యయనం చేయాలని తెలిపారు. రవాణా, విద్యుత్ ఉత్పత్తి, సౌర విద్యుత్, వ్యవసాయ రంగాలను సమన్వయం చేయడం ద్వారా అదనపు ఆదాయ వనరులను సృష్టించవచ్చని సీఎం అభిప్రాయపడ్డారు. అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించుకోవడంపై దృష్టి పెట్టాలని సూచించారు.

వాటర్ రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటుపై అధ్యయనం

జలవనరుల వినియోగానికి సంబంధించి కూడా నియంత్రణ వ్యవస్థ అవసరమని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. విద్యుత్ రంగంలో ఉన్న రెగ్యులేటరీ కమిషన్ తరహాలో వాటర్ రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. పోర్టులు, విద్యుత్ రంగాల్లో మాదిరిగా సాగునీటి రంగంలోనూ ప్రత్యేక నియంత్రణ వ్యవస్థ ఉంటే నీటి వినియోగాన్ని సమర్థంగా నిర్వహించవచ్చని తెలిపారు. గంగా--కావేరి నదుల అనుసంధానం వంటి భారీ ప్రాజెక్టుల ద్వారా రవాణా, విద్యుత్, పరిశ్రమలు, వ్యవసాయ రంగాలకు ప్రయోజనం కలిగే అవకాశాలున్నాయని వివరించారు. వివిధ రంగాల అవసరాలకు అనుగుణంగా నీటి వినియోగంపై నిర్ణయాలు తీసుకునే విధంగా వాటర్ రెగ్యులేటరీ కమిషన్ ప్రతిపాదనను అధ్యయనం చేయాలని చంద్రబాబు అధికారులను

ముందున్న మొసళ్ల పండుగ

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలపై కూటమి ఎంతో జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అధిక స్థానాల్లో కూటమి విజయం సాధించినప్పటికీ ముందున్న సవాళ్లు మరియు క్షేత్రస్థాయి బాధ్యతలు మరింత పెద్దవని చెప్పవచ్చు. ఎన్నికల్లో గెలవడం ఒక ఎత్తయితే, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చి వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవడం మరో ఎత్తు. అలాగే రానున్న రెండున్నరేళ్ల సమయం అత్యంత కీలకం. చివరి ఏడాది ఎన్నికల ఏడాది. ఇక మిగిలింది ఏడాదిన్నర మాత్రమే. ఈ ఏడాదిన్నర మాత్రమే కూటమి ప్రభుత్వానికి సమయం ఉంది. ఈ ఏడాదిన్నర కాలం కూటమికి కీలకమనే చెప్పాలి. ఎందుకంటే స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాల్లో కూటమి విజయం సాధించినప్పటికీ పోలింగ్ శాతం పెరగకపోవడం ఆందోళన కలిగించే అంశమే. అందుకే రానున్న రెండున్నరేళ్లు కూటమి ప్రభుత్వం అనేక అంశాలపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జాగ్రత్తపడకపోతే అంతే హామీల అమలు... సూపర్ సిక్స్ హామీల అమలు పెద్ద టాస్క్ అని చెప్పాలి. కూటమి అధికారంలోకి రావడానికి ప్రధాన కారణమైన 'సూపర్ సిక్స్' పథకాలను పూర్తి స్థాయిలో, నిరంతరాయంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం పెద్ద సవాల్. రాష్ట్రం ఎదుర్కొంటున్న ఆర్థిక లోటును అధిగమిస్తూ, ఒకవైపు సంక్షేమ పథకాలను, మరోవైపు అభివృద్ధి పనులను సమన్వయం చేసుకోవడం కత్తిమీద సాము లాంటిది. స్థానిక సంస్థలలో గెలిచినంత మాత్రాన సరిపోదు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు తగిన నిధులు కేటాయించి, గ్రామ మరియువార్డు స్థాయిల్లో మౌలిక వసతుల రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధిని పరుగులు పెట్టించాల్సి ఉంటుంది. నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు కొత్త పరిశ్రమలను ఆకర్షించడం, ఐటీ రంగ అభివృద్ధి మరియు ఉద్యోగ నియామకాలు వేగవంతం చేయాలి. కేవలం ఎన్నికల విజయాల సంబరాలకే పరిమితం కాకుండా, రాబోయే రోజుల్లో క్షేత్రస్థాయిలో పాలనను ఎంత సమర్థవంతంగా అందిస్తారనే దానిపైనే కూటమి భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. 2019 ఎన్నికలలోనూ చంద్రబాబు తాను చేసిన అభివృద్ధి, సంక్షేమం ఒడ్డును పడేస్తుందని గట్టిగా భావించారు. కానీ బొమ్మ తిరగబడిందన్న విషయం గుర్తుంచుకోవాలి. ప్రతిపక్ష వైసీపీ బలం ఏ మాత్రం తగ్గలేదన్నది కూడా సుస్పష్టం. అలాగే 2024 ఎన్నికలకు ముందు జగన్ కూడా స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలను చూసి మురిసిపోయారు. కానీ ఆ రోజు ఎన్నికల్లో ప్రజలు దిమ్మతిరిగే తీర్పు ఇచ్చారు. పదకొండు సీట్లకే పరిమితం చేశారు. చేసిన మంచి పనులు చెప్పుకోవడం మంచిదే అయినా..ప్రజలు కేవలం వాటిని చూసే గెలిపిస్తారని అనుకోవడం మాత్రం ఊహాజనితమే. గత కొన్ని ఎన్నికల నుంచి ప్రజలు అదేరకమైన తీర్పు చెబుతూ వస్తున్నారు. కూటమి ప్రభుత్వం చేసిన మంచి పనులను చెప్పుకోవడంతో పాటు తమ ప్రభుత్వంలో ఉన్న లోటు పాట్లను కూడా సరిదిద్దుకోవాల్సి ఉంటుంది. ఎమ్మెల్యేలపై అసంతృప్తి, అవినీతి వంటివి సాధారణ ఎన్నికల్లో బలంగా పనిచేస్తాయని చెప్పక తప్పదు. మరొకవైపు ప్రజల కొనుగోలు శక్తి కూడా పెరగాల్సి ఉంటుంది. కేవలం పింఛన్లు పంపిణీ చేశామని చెప్పుకుంటే సరిపోదు. వారికి ఎప్పటికప్పుడు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ఆర్థికంగా ఆదుకుంటేనే కూటమి పక్షాన నిలబడతారు.



లేకుంటే పడిపోతారు.

రాజానగరంలో సెటైర్లు

ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా కూటమి పార్టీల హవా కనిపించినప్పటికీ, తూర్పుగోదావరి జిల్లాలోని రాజానగరం నియోజకవర్గం మాత్రం భిన్నమైన ఫలితాలను నమోదు చేసింది. ముఖ్యంగా జనసేన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కుటుంబానికి ఈ ఎన్నికలు ఊహించని షాక్ ఇచ్చాయి. ఎమ్మెల్యే సతీమణి బత్తుల వెంకటలక్ష్మి సీతానగరం జెడ్పీటీసీ స్థానంలో ఓటమి చెందడం రాజకీయంగా పెద్ద చర్చకు దారితీసింది. వైసీపీ అభ్యర్థి కరుటూరి శ్రీహరి బాబు) ఏకంగా 2,607 ఓట్ల మెజారిటీతో విజయం సాధించడం జనసేన వర్గాలను నిరాశకు గురిచేసింది.రాష్ట్రవ్యాప్తంగా కూటమి అనుకూల ఫలితాలు వస్తున్న సమయంలో రాజానగరంలో మాత్రం వైసీపీ మంచి ఆధిపత్యాన్ని ప్రదర్శించడం ఆసక్తికరంగా మారింది. ఈ ఫలితాలు స్థానిక రాజకీయ సమీకరణాలపై కొత్త చర్చకు తెరలేపాయి. ముఖ్యంగా ఎమ్మెల్యే సొంత కుటుంబానికి చెందిన అభ్యర్థి ఓటమి చెందడంతో ఆయన రాజకీయ బలంపై ప్రత్యర్థులు ప్రశ్నలు సంధిస్తున్నారు. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిని మరోసారి సమీక్షించుకోవాల్సిన అవసరం ఉందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.ఈ ఎన్నికల ఫలితాలు ఇప్పుడు సోషల్ మీడియాలో కూడా హాట్ టాపిక్‌గా మారాయి. గతంలో బత్తుల బలరామకృష్ణ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ వైసీపీ అభిమానులు విమర్శలు గుప్పిస్తున్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని పులివెందులలో ఓడిస్తామంటూ గతంలో ఆయన చేసిన వ్యాఖ్యలకు ఇప్పుడు స్థానిక ఎన్నికల ఫలితాలను జోడించి సెటైర్లు వేస్తున్నారు. సొంత నియోజకవర్గంలోనే కుటుంబ సభ్యురాలిని గెలిపించుకోలేకపోయిన నాయకుడు పులివెందుల గురించి మాట్లాడటం ఏమిటంటూ ప్రశ్నిస్తున్నారు. ఈ విమర్శలు జనసేన శ్రేణులకు ఇబ్బందికరంగా మారాయి.మరోవైపు మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అనుచరులు మాత్రం ఈ విజయాలను ఘనంగా జరుపుకుంటున్నారు. ఎన్నికల సమయంలో పార్టీ శ్రేణులను సమన్వయం చేయడం, క్షేత్రస్థాయిలో నాయకులను కలుపుకొని వెళ్లడం వల్లే మంచి ఫలితాలు సాధ్యమయ్యాయని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. జక్కంపూడి రాజా నాయకత్వం మరోసారి తన ప్రభావాన్ని నిరూపించుకుందని అభిమానులు ప్రచారం చేస్తున్నారు. ఆయనను ఎదుర్కొన్న తర్వాతే ఇతర రాజకీయ ప్రత్యర్థుల గురించి మాట్లాడాలంటూ జనసేన ఎమ్మెల్యేకు సవాళ్లు విసురుతున్నారు.సీతానగరం, కోరుకొండ ప్రాంతాల్లోనూ వైసీపీ సాధించిన విజయాలను ఆ పార్టీ శ్రేణులు ప్రస్తావిస్తున్నాయి. సీతానగరంలో మొత్తం 21 ఎంపీటీసీ స్థానాలకు 18 స్థానాలను, కోరుకొండలో 23 స్థానాలకు 12 స్థానాలను కైవసం చేసుకున్నట్లు వైసీపీ అభిమానులు పేర్కొంటున్నారు. ఈ ఫలితాలను తమ నాయకత్వానికి, కేడర్ ఐక్యతకు నిదర్శనంగా చూపిస్తున్నారు. రాజానగరంలో వచ్చిన ఫలితాలు కేవలం ఒక స్థానానికి పరిమితం కాకుండా నియోజకవర్గ రాజకీయాల్లో మార్పునకు సంకేతమని వారు విశ్లేషిస్తున్నారు.అయితే, ఈ విజయాల వెనుక స్థానిక సమస్యలు, నాయకుల పనితీరు, పార్టీ కేడర్ మధ్య సమన్వయం వంటి అంశాలు కీలకంగా పనిచేసి ఉండవచ్చని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తన నియోజకవర్గంలో పార్టీ బలాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉందనే చర్చ మొదలైంది. ముఖ్యంగా జనసేన నాయకత్వం క్షేత్రస్థాయిలో ప్రజలతో మరింత మమేకం కావాలని ఈ ఫలితాలు సూచిస్తున్నాయని విశ్లేషకులు అంటున్నారు.మొత్తానికి రాజానగరం స్థానిక ఎన్నికల ఫలితాలు కూటమి, వైసీపీ మధ్య రాజకీయ పోరును మరోసారి తెరపైకి తీసుకొచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా కూటమికి అనుకూల పవనాలు వీచినప్పటికీ, రాజానగరంలో వైసీపీ సాధించిన విజయాలు ఆ పార్టీకి కొత్త ఉత్సాహాన్ని ఇచ్చాయి. రాబోయే రోజుల్లో ఈ ఫలితాల ప్రభావం నియోజకవర్గ రాజకీయాలపై ఎంతవరకు ఉంటుందనేది ఆసక్తికరంగా మారింది.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఏపీకి ఆరు జాతీయ అవార్డులు!

-మొదటిపేజీ తరువాయి

ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము విజేతలకు పురస్కారాలను అందజేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున పురపాలక శాఖ మంత్రి నారాయణ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్ అవార్డులను స్వీకరించారు.

ఐదు కార్పొరేషన్లు.. కుప్పం మున్సిపాలిటీ

రాష్ట్రంలోని ఐదు నగరపాలక సంస్థలతో పాటు ఒక మున్సిపాలిటీకి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. విశాఖపట్నం, విజయవాడ, రాజమహేంద్రవరం, గుంటూరు, తిరుపతి నగరపాలక సంస్థలు అవార్డులు సాధించగా, చిత్తూరు జిల్లాలోని కుప్పం మున్సిపాలిటీ కూడా పురస్కారాన్ని దక్కించుకుంది.

తిరుపతి--కుప్పం జోడీకి మూడో ర్యాంకు

స్వచ్ఛ్ సెహర్ జోడీ విభాగంలో తిరుపతి--కుప్పం జంట దేశవ్యాప్తంగా మూడో ర్యాంకును సాధించింది. ఈ విభాగంలో తిరుపతి మెంటార్ సిటీగా, కుప్పం మెంటీ సిటీగా ఎంపికయ్యాయి. పట్టణాల మధ్య పరస్పర సహకారం, పారిశుద్ధ్య నిర్వహణలో అనుభవాల మార్పిడి వంటి అంశాలకు ఈ విభాగంలో ప్రాధాన్యం ఉంటుంది.

విజయవాడ, గుంటూరుకు ప్రత్యేక గుర్తింపు

నేషనల్ క్లీన్ సిటీ విభాగంలో విజయవాడ నగరపాలక సంస్థ మూడో ర్యాంకుకు ఎంపికైంది. 3 నుంచి 10 లక్షల జనాభా కలిగిన నగరాల విభాగంలో గుంటూరు మూడో ర్యాంకును సాధించింది. ఇక రాష్ట్రంలో తొలి స్వచ్ఛ్ సిటీగా రాజమహేంద్రవరం గుర్తింపు పొందింది. దీంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు నగరాలు, పట్టణాల పారిశుద్ధ్య నిర్వహణకు జాతీయ స్థాయిలో ప్రశంసలు లభించాయి.

కార్మికుల శ్రమతోనే గుర్తింపు: మంత్రి నారాయణ

'స్వచ్ఛాంధ్ర--స్వర్ణాంధ్ర' సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల వల్లే ఆరు అవార్డులు సాధ్యమయ్యాయని మంత్రి నారాయణ పేర్కొన్నారు. పారిశుద్ధ్య కార్మికుల నిరంతర శ్రమ, అధికారుల పర్యవేక్షణతోనే ఈ గుర్తింపు లభించిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గదర్శకత్వంలో భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే స్వచ్ఛతా కార్యక్రమాల్లో అగ్రగామిగా నిలపడమే లక్ష్యమని తెలిపారు.

ఏపీలో కొత్త రాజకీయ పార్టీ ఆవిర్భావం!

విజయవాడ: ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరో కొత్త పార్టీ ఆవిర్భవించింది. మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి 'పరివర్తన రాజనీతి పార్టీ' (పీఆర్‌పీ)ని ప్రకటించారు. విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ పేరుతో పాటు జెండాను ఆవిష్కరించారు. కాషాయం, తెలుపు రంగుల మధ్యలో అశోకచక్రం ఉండేలా పార్టీ జెండాను రూపొందించారు. 'దేశం కోసం.. ధర్మం కోసం' అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్లనున్నట్లు విజయసాయిరెడ్డి వెల్లడించారు.

ప్రజల చేతుల్లోనే రాష్ట్ర భవిష్యత్తు

పార్టీ ఆవిర్భావ కార్యక్రమం అనంతరం విజయసాయిరెడ్డి మాట్లాడుతూ.. ఏ ఒక్క నాయకుడి వల్లనో రాష్ట్రం, దేశం మారిపోవని అన్నారు. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు ఏ ఒక్క నాయకుడి చేతుల్లోనూ లేదని, ప్రజల చేతుల్లోనే ఉందని పేర్కొన్నారు. ఓటు వేసినంత మాత్రాన ప్రజల బాధ్యత ముగిసిపోదని చెప్పారు. ప్రభుత్వాలు ఏవైనా తాము చేసిన మంచి పనులనే ప్రచారం చేసుకుంటాయని, అయితే మంచి పని ఎవరు చేసినా అభినందించాలని సూచించారు. తప్పు ఎవరు చేసినా ఆధారాలతో ప్రశ్నించాలని, ప్రశ్నించడం ప్రజాస్వామ్యంలో ప్రజలకు ఉన్న హక్కు అని వ్యాఖ్యానించారు.

యువతే పార్టీకి ప్రధాన బలం

తాను మరో నాయకుడిని తయారు చేయడానికి పార్టీ పెట్టలేదని విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. యువతలో దాగి ఉన్న నాయకత్వ లక్షణాలను వెలికితీసి, వారిని నాయకులుగా తీర్చిదిద్దడమే పార్టీ లక్ష్యమని తెలిపారు. ప్రతి సామాజిక వర్గం నుంచి నాయకత్వాన్ని ప్రోత్సహిస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి కావాలనే ఆశ తనకు లేదని, యువతలోనే సీఎం అభ్యర్థిని ఎంపిక చేస్తానని ప్రకటించారు.

కుటుంబ రాజకీయాలపై విమర్శలు

రాష్ట్రంలో ఐదు కోట్ల మంది ప్రజలను రెండు కుటుంబాలే శాసిస్తున్నాయని విజయసాయిరెడ్డి విమర్శించారు. ప్రజాస్వామ్యంలో కొద్దిమంది కుటుంబాల ఆధిపత్యమే కొనసాగాలా అని ప్రశ్నించారు. వారసత్వ రాజకీయాలకు స్వస్తి పలకాల్సిన అవసరం ఉందన్నారు. కొత్త తరానికి రాజకీయాల్లో అవకాశాలు కల్పించడమే తమ పార్టీ ఉద్దేశమని వివరించారు.

ఆధారాలతో ప్రశ్నించాలి

ప్రభుత్వాలు చేసే పనులను ప్రజలు నిశితంగా పరిశీలించాలని విజయసాయిరెడ్డి పిలుపునిచ్చారు. మంచి పనులను అభినందిస్తూనే, తప్పులను ఆధారాలతో ప్రశ్నించాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యం, యువత నాయకత్వం, సామాజిక వర్గాల ప్రాతినిధ్యమే లక్ష్యాలుగా పరివర్తన రాజనీతి పార్టీ పనిచేస్తుందని ఆయన వెల్లడించారు. రాజకీయాల్లో కొత్త ప్రత్యామ్నాయంగా ఎదగడమే లక్ష్యంగా పీఆర్‌పీ ఆవిర్భవించినట్లు విజయసాయిరెడ్డి ప్రకటించారు. పార్టీ విధానాలు, కార్యాచరణ, సంస్థాగత నిర్మాణంపై మరిన్ని వివరాలు వెల్లడించాల్సి ఉంది.

బడి కోసం పోర్టల్ ద్వారా 10 కోట్ల నిధులు



నెల్లూరు : ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ స్కూళ్లు, జూనియర్ కాలేజీలకు మౌలిక వసతుల కల్పించేందుకు దాతల నుంచి ప్రభుత్వం విరాళాలు సేకరిస్తోంది. 'బడి కోసం' పేరుతో పోర్టల్‌ను ప్రారంభించి దాతల నుంచి విరాళాలు సేకరిస్తున్నారు. ఈ బడి కోసం పోర్టల్ ద్వారా విరాళాలు అందించేందుకు దాతలు ముందుకు వస్తున్నారు. ఈ ఏడాది జులై 24న పోర్టల్‌ను ప్రారంభించగా.. ఇప్పటి వరకు దాతలు రూ.9.78 కోట్లు అందించారు. వస్తువులు, సివిల్ వర్క్స్ రూపంలో సాయం అందించారు.రాష్ట్రవ్యాప్తంగా 1,541 ప్రభుత్వ స్కూళ్లకు 1,679 మంది దాతలు విరాళాలు అందించారు.కొంతమంది దాతలు సర్కారు బడుల అభివృద్ధిలో భాగస్వాములయ్యేందుకు తమ స్థాయికి తగ్గట్టు తక్కువ మొత్తంలో విరాళాలు అందిస్తున్నారు. ఈ విరాళాలలో అత్యధికంగా పల్నాడు జిల్లాకు రూ.89.36 లక్షలు, శ్రీకాకుళం జిల్లాకు రూ.73.28 లక్షలు, చిత్తూరుకు రూ.60.39 లక్షలు విరాళాల రూపంలో వచ్చాయి. రాష్ట్రంలో మొత్తం మీద 43,068 బడులకు పూర్తిస్థాయిలో అన్నిరకాల వసతులు కల్పించేందుకు రూ.6,320 కోట్లు అవసరమని అంచనా వేశారు. బడి కోసం పోర్టల్ ద్వారా ప్రతి స్కూల్‌కు అవసరమైన సామాగ్రి, సివిల్ వర్క్స్ వివరాలను అందుబాటులో ఉంచారు. అదనంగా తరగతి గది నిర్మించడానికి రూ.18.50 లక్షలు ఖర్చవుతుందని అంచనా వేశారు.స్కూల్‌లో తరగతి గది, ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుకు దాతలు పూర్తిమొత్తం అందించాల్సి ఉంటుంది. విరాళాలు అందించే దాతలకు విద్యాశాఖ మంత్రి లోకేష్ నుంచి ప్రశంసాపత్రం అందుతుంది. ఈ విరాళాలు ఇవ్వాలనుకుంటున్న దాతలు ముందుగా పోర్టల్‌లో వ్యక్తిగత వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. ఒకవేళ దాతలు ఎవరైనా తరగతి గదులు, భవన నిర్మాణానికి పూర్తిగా నిధులిస్తే.. ఆ దాతల పేర్లను ఆయా గదులు, భవనాలకు పెడతారు. విద్యార్థులు కూర్చోవడానికి 11,080 డ్యుయల్ డెస్క్‌లు, 14,031 బడులకు గ్రీన్ చాక్‌పీస్ బోర్డులు అవసరమని అంచనా వేశారు.ఈ బడి కోసం పోర్టల్‌ను ప్రారంభించిన రోజే నెల్లూరు జిల్లాకు చెందిన ఓ పారిశ్రామికవేత్త రూ.4 కోట్లు విరాళంగా అందించారు. పోలవరం జెడ్పీ స్కూల్‌లో చదువుకుని.. ఆ దగ్గలోనే జిరాక్స్ కేంద్రాన్ని నడుపుతున్న మరో వ్యక్తి రూ.లక్ష విరాళంగా ఇచ్చారు. సివిల్ వర్క్స్‌లో భాగంగా స్కూల్ గ్రౌండ్ అభివృద్ధి, తలుపులు, కిటికీలు, డెస్కులు, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం, తరగతి గదుల నిర్మాణం వంటి అంశాలు కూడా ఉన్నాయంటున్నారు అధికారులు. మొత్తం మీద బడి కోసం పోర్టల్‌కు దాతల నుంచి మంచి స్పందన వస్తోంది. చాలామంది విరాళాలు అందించేందుకు ముందుకు వస్తున్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని విరాళాలు వస్తాయని చెబుతున్నారు.

మన్యంలో మరో కోణం!

మన్యం వాసుల మదిలో ఏముంది?

స్థానిక ఎన్నికల్లో భారీగా వీచిన ఫ్యాను గాలి.. జోరు తగ్గిన సైకిల్ స్పీడు!

ప్రభావం చూపని కూటమి పొత్తు.. మన్యం కూటమి కొంపముంచిన సీట్ల సర్దుబాటు!

పోలవరం నిర్వాసితుల సమస్యల ప్రభావం.. ఏజెన్సీలో వైసీపీకి కలిసొచ్చిన రాజకీయ పరిణామాలు!





చింతూరు,నవంబర్ 11 మీ వార్త ప్రతినిధి :
రాష్ట్రవ్యాప్తంగా కూటమి రాజకీయ ఆధిపత్యం కొనసాగుతున్న తరుణంలో స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు కొన్ని ప్రాంతాల్లో భిన్నమైన రాజకీయ చిత్రాన్ని ఆవిష్కరించాయి. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీ ప్రాంతంతో పాటు పోలవరం ప్రాజెక్టు ప్రభావిత ప్రాంతాల్లోనూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయాలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. రాష్ట్రంలో కూటమి గాలి బలంగా వీచినా మన్యం ప్రాంతంలో మాత్రం ఫ్యాను ప్రభావం స్పష్టంగా కనిపించింది. సైకిల్ వేగం ఆశించిన స్థాయిలో లేకపోవడానికి కారణాలేమిటి? కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు లోపించిందా? పోలవరం నిర్వాసితుల సమస్యలు అధికార కూటమికి ప్రతికూలంగా మారాయా? స్థానిక నాయకత్వంపై ప్రజల్లో ఉన్న అభిప్రాయాలే ఫలితాలను ప్రభావితం చేశాయా? అనే ప్రశ్నలు ఇప్పుడు రాజకీయ చర్చకు దారితీస్తున్నాయి.

రాష్ట్రంలో కూటమి హవా.. మన్యంలో మాత్రం భిన్నమైన తీర్పు!
రాష్ట్రవ్యాప్తంగా కూటమి విజయోత్సాహం కనిపించినప్పటికీ అల్లూరి సీతారామరాజు జిల్లాలో మాత్రం వైసీపీ తన రాజకీయ పట్టును చాటుకుంది.జిల్లాలోని 11 జెడ్పీటీసీ స్థానాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏడు స్థానాలను కైవసం చేసుకోగా, తెలుగుదేశం పార్టీ మూడు స్థానాల్లో విజయం సాధించింది. సీపీఎం ఒక స్థానాన్ని దక్కించుకుంది.రాష్ట్ర రాజకీయాలకు భిన్నంగా మన్యం ఓటరు ఇచ్చిన ఈ తీర్పు వెనుక అనేక స్థానిక రాజకీయ అంశాలు ఉన్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఫ్యాను గాలి వెనుక స్థానిక రాజకీయ సమీకరణాలు!
మన్యం ప్రాంతంలో వైసీపీ విజయాలను కేవలం పార్టీ గుర్తు ప్రభావంగా చూడలేం. గిరిజన గ్రామాల్లో స్థానిక నాయకులతో ప్రజలకు ఉన్న సంబంధాలు, నాయకుల అందుబాటు, గత రాజకీయ అనుబంధాలు, అభ్యర్థుల వ్యక్తిగత పరిచయాలు కూడా కీలక పాత్ర పోషించి ఉండవచ్చు.మన్యంలో ఎన్నికలంటే కేవలం పార్టీ ప్రచారాలు, జెండాలు, సభలు మాత్రమే కాదు. గ్రామస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండటం, వారి సమస్యలపై స్పందించడం, కష్టసుఖాల్లో తోడుగా నిలవడం కూడా గెలుపోటములను నిర్ణయించే అంశాలు.

సైకిల్ స్పీడు ఎందుకు తగ్గింది?
రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమికి మన్యంలో ఆశించిన ఫలితాలు రాకపోవడం వెనుక కారణాలను విశ్లేషించాల్సిన అవసరం ఉంది.ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి హామీలు ఒకవైపు ఉన్నప్పటికీ స్థానిక ఎన్నికల్లో అభ్యర్థుల వ్యక్తిగత బలం, గ్రామస్థాయి నాయకత్వం, కార్యకర్తల సమన్వయం అత్యంత కీలకం.అధికారంలో ఉన్నామనే ధీమా క్షేత్రస్థాయిలో ఓట్లుగా మారిందా? స్థానిక నాయకత్వం ప్రజలకు ఎంతవరకు చేరువైంది? పార్టీ శ్రేణుల మధ్య సమన్వయం ఎలా ఉంది? అనే ప్రశ్నలు కూటమి నేతల ముందున్నాయి.

కూటమి పొత్తు ఉన్నా.. ఓట్ల బదిలీ జరిగిందా?
తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీలు కూటమిగా ఉన్నప్పటికీ స్థానిక స్థాయిలో ఆ ఐక్యత ఓట్లుగా మారిందా? అన్నది పరిశీలించాల్సిన అంశం. పార్టీల మధ్య రాజకీయ పొత్తు ఏర్పడటం ఒక ఎత్తయితే, క్షేత్రస్థాయిలో కార్యకర్తలు, నాయకులు కలిసి పనిచేయడం మరో ఎత్తు.కొన్ని ప్రాంతాల్లో పార్టీల సంప్రదాయ ఓటు బ్యాంకులు పూర్తిస్థాయిలో బదిలీ కాలేకపోయాయా? స్థానికంగా పార్టీ శ్రేణుల్లో అసంతృప్తి ఉందా? అన్న ప్రశ్నలు కూడా చర్చకు వస్తున్నాయి.

సీట్ల సర్దుబాటే కూటమి కొంపముంచిందా?
కూటమి పార్టీల మధ్య స్థానాల కేటాయింపు కూడా ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపే అంశంగా కనిపిస్తోంది.ఏ ప్రాంతంలో ఏ పార్టీకి బలం ఉంది? ఎవరికి స్థానికంగా ప్రజాదరణ ఉంది? ఏ అభ్యర్థికి గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి? అనే అంశాలను పరిగణనలోకి తీసుకుని సీట్ల కేటాయింపు జరిగిందా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.బలమైన స్థానిక నాయకులకు అవకాశం దక్కకపోవడం, ఆశావహులకు నిరాశ ఎదురవడం, అభ్యర్థుల ఎంపికపై అసంతృప్తి వంటి అంశాలు కూటమి విజయావకాశాలను దెబ్బతీసి ఉండవచ్చు.

పోలవరం సమస్య.. నిర్వాసితుల ఆవేదన ప్రభావం!
మన్యం రాజకీయ పరిణామాలను విశ్లేషించేటప్పుడు పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలను విస్మరించలేం.పోలవరం ప్రాజెక్టు కారణంగా గోదావరి పరివాహక ప్రాంతాల్లోని అనేక గిరిజన గ్రామాలు, కుటుంబాలు నిర్వాసితులుగా మారాయి. ప్రాజెక్టు పూర్తితో అభివృద్ధి జరుగుతుందనే ఆశ ఒకవైపు ఉంటే, మరోవైపు తమ పూర్వీకుల భూములు, ఇళ్లు, జీవనాధారం, సంస్కృతి, సంప్రదాయాలను కోల్పోతున్నామనే ఆవేదన నిర్వాసితుల్లో ఉంది.పునరావాస ప్యాకేజీలు అందరికీ పూర్తిస్థాయిలో అందాయా? అర్హులైన ప్రతి కుటుంబానికి న్యాయం జరిగిందా? పునరావాస కాలనీల్లో తాగునీరు, రోడ్లు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాలు ఎలా ఉన్నాయి? భూములకు నష్టపరిహారం, జీవనోపాధి కల్పనలో ఎదురవుతున్న సమస్యలు పరిష్కారమయ్యాయా? అనే ప్రశ్నలు నిర్వాసిత ప్రాంతాల్లో ఇప్పటికీ ప్రాధాన్యత కలిగినవే.ఈ సమస్యలపై ప్రజల్లో ఉన్న అసంతృప్తి ఎన్నికల సమయంలో రాజకీయ అభిప్రాయాలపై ప్రభావం చూపి ఉండవచ్చు.పోలవరం నిర్వాసితుల సమస్యలను రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో ప్రస్తావించడం మాత్రమే కాకుండా, పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాల్సిన అవసరం ఉంది.

పోలవరం జిల్లాలో వైసీపీ విజయ సంకేతం!
అల్లూరి ఏజెన్సీ ప్రాంతంతో పాటు పోలవరం ప్రాజెక్టు ప్రభావిత ప్రాంతాల్లోనూ వైసీపీ విజయాలు సాధించడం రాజకీయంగా ఆసక్తికరమైన పరిణామం.ఈ రెండు ప్రాంతాల సమస్యలు వేర్వేరుగా ఉన్నప్పటికీ గిరిజన జీవన విధానం, భూమి, పునరావాసం, జీవనాధారం, ప్రభుత్వ హామీల అమలు వంటి అంశాల్లో కొన్ని సారూప్యతలు కనిపిస్తాయి.అభివృద్ధి పేరుతో తమ జీవితాల్లో వచ్చిన మార్పులపై ప్రజలు ఎలాంటి అభిప్రాయంతో ఉన్నారు? ప్రభుత్వ హామీలు క్షేత్రస్థాయిలో ఎంతవరకు అమలయ్యాయి? అనే అంశాలపై ఓటరు తన నిర్ణయాన్ని వెల్లడించి ఉండవచ్చనే రాజకీయ విశ్లేషణలు వినిపిస్తున్నాయి.అయితే ఈ విజయాలను కేవలం పోలవరం నిర్వాసితుల సమస్యల ప్రభావంగానే పరిగణించడం సరికాదు. అభ్యర్థుల బలం, స్థానిక రాజకీయ సమీకరణాలు, పార్టీల ప్రచారం, ఓట్ల బదిలీ వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

గిరిజన ఓటరు ఇచ్చిన సందేశం ఏమిటి?
మన్యం, పోలవరం ప్రభావిత ప్రాంతాల ఎన్నికల ఫలితాలు గిరిజన ప్రజల రాజకీయ చైతన్యాన్ని మరోసారి చాటిచెబుతున్నాయి.రోడ్లు, తాగునీరు, విద్య, వైద్యం, అటవీ హక్కులు, భూముల సమస్యలు, నిర్వాసితుల పునరావాసం, ఉపాధి వంటి అంశాలు ఇక్కడి ప్రజల జీవితాలతో ముడిపడి ఉన్నాయి.ఎన్నికల సమయంలో ఇచ్చే హామీల కంటే తమ సమస్యలపై ఎవరు స్పందిస్తున్నారు? తమకు ఎవరు అందుబాటులో ఉంటున్నారు? తమ హక్కుల కోసం ఎవరు పోరాడుతున్నారు? అనే అంశాల ఆధారంగా ఓటరు నిర్ణయం తీసుకుంటున్నాడనే అభిప్రాయానికి ఈ ఫలితాలు అవకాశం కల్పిస్తున్నాయి.

గెలుపు వైసీపీకి.. గుణపాఠం కూటమికి!
ఈ ఎన్నికల ఫలితాలు వైసీపీకి మన్యం, పోలవరం ప్రభావిత ప్రాంతాల్లో రాజకీయంగా కొత్త ఉత్సాహాన్ని ఇచ్చాయి. అదే సమయంలో కూటమి పార్టీలకు ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరాన్ని గుర్తుచేశాయి.రాష్ట్రంలో అధికారంలో ఉండటం మాత్రమే స్థానికంగా విజయానికి హామీ కాదని ఈ ఫలితాలు సూచిస్తున్నాయి. స్థానిక ప్రజల నమ్మకం, నాయకత్వం, అభ్యర్థుల ఎంపిక, ప్రజా సమస్యల పరిష్కారం కూడా అంతే ముఖ్యమని స్పష్టం చేస్తున్నాయి.ఫ్యాను గాలి ఎందుకు బలంగా వీచింది? సైకిల్ వేగం ఎక్కడ తగ్గింది? కూటమి ఓట్లు ఎందుకు పూర్తిస్థాయిలో ఏకం కాలేకపోయాయి? సీట్ల సర్దుబాటులో ఎక్కడ లోపాలు జరిగాయి? పోలవరం నిర్వాసితుల సమస్యలు ఎన్నికల తీర్పును ఎంతవరకు ప్రభావితం చేశాయి?ఈ ప్రశ్నలకు రాజకీయ పార్టీలు సమాధానాలు వెతకాల్సిన సమయం ఆసన్నమైంది.మన్యం నుంచి పోలవరం వరకు గిరిజన ప్రాంతాల ప్రజలు తమ సమస్యలపై రాజకీయ పార్టీలు మరింత బాధ్యతగా వ్యవహరించాలని ఆశిస్తున్నారనే విషయాన్ని ఈ ఎన్నికలు గుర్తుచేస్తున్నాయి.అధికారం ఎవరి చేతిలో ఉన్నా.. ప్రజల సమస్యలను పట్టించుకోకపోతే ఓటరు తన ఓటుతో సమాధానం చెబుతాడనే రాజకీయ సందేశం ఈ ఫలితాల్లో దాగి ఉంది.మన్యం తీర్పు.. రాజకీయ పార్టీలకు ఒక హెచ్చరిక. పోలవరం ప్రజల ఆవేదన.. పాలకులకు ఒక బాధ్యత.మన్యం కవి, రచయిత, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నూనె రమేష్ - 9951237879

ఎన్నికల్లో అధికార పార్టీ అక్రమాలను ఖండించండి: ఆర్. డి. ఒ కార్యాలయం ఎదుట సిపిఎం నిరసన



పెద్దాపురం నవంబర్ 11 న్యూస్ (మీ వార్త ప్రతినిధి) రాష్ట్రంలో మున్సిపల్, యంపిటిసి, జెడ్పిటిసి, ఎన్నికల సందర్భంగా వివిధ ప్రాంతాల్లో కూటమి పార్టీలు అధికార బలంతో దౌర్జన్యాలు, బూత్ ఆక్రమణలకు పాల్పడడాన్ని సిపిఎం నిరసిస్తూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా పెద్దాపురం రెవిన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం ఎదుట సిపిఐ పెద్దాపురం – సామర్లకోట కమిటీ ల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు.ఈ సందర్భంగా సిపిఎం పెద్దాపురం మండల కార్యదర్శి దారపురెడ్డి క్రాంతి కుమార్ మాట్లాడుతూ రాష్ట్రం లో నాడు వైసీపీ నేడు టీడీపీ నాయకత్వం లోని కూటమి ప్రభుత్వం ఎన్నికలో ఒకే తీరుగా వ్యవహరించారాని అన్నారు.ప్రజలకోసం పనిచేసే సిపిఎం పార్టీ నాయకులను పోలింగ్ బూత్ దగ్గర ఆదుకోవడం, నామినేషన్ పత్రాలు లాకోవడం ప్రజాస్వామ్యని అపహాస్యం చేయడమే అన్నారు.స్థానిక సంస్థల ఎన్నికలో ఏకగ్రీవలు బెదిరించి చేయడమే కాదని అన్నారు. ప్రజాస్వామ్యం ని రక్షించాల్సిన బాధ్యత మన అందరిపైన ఉందని అన్నారు.ఈ కార్యక్రమం లో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గొల్లపాలెం సముద్ర తీరానికి కొట్టుకొచ్చిన భారీ రబ్బర్ ఫెండర్!


Malikipuram: గొల్లపాలెం సముద్ర తీరానికి కొట్టుకొచ్చిన భారీ రబ్బర్ ఫెండర్!

రాజోలు నవంబర్ 11(మీ వార్త విలేఖరి) అంబేద్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం గొల్లపాలెం సముద్ర తీరానికి భారీ రబ్బర్ ఫెండర్ కొట్టుకొచ్చింది. తుఫాను ప్రభావంతో సముద్రంలో అలల ఉధృతి పెరగడంతో అంబేద్కర్ కోనసీమ జిల్లా, మలికిపురం మండలం గొల్లపాలెం సముద్ర తీరానికి భారీ రబ్బర్ ఫెండర్ కొట్టుకొచ్చింది. సముద్రపు ఒడ్డున భారీ పరిమాణంలో ఉన్న ఈ పరికరం కనిపించడంతో స్థానికులు ఆసక్తిగా పరిశీలించారు. సాధారణంగా పోర్టులు, నౌకాశ్రయాల్లో నౌకల భద్రత కోసం రబ్బర్ ఫెండర్లను వినియోగిస్తారు. నౌకలు జెట్టీలను లేదా ఒకదానికొకటి ఢీకొన్నప్పుడు ఏర్పడే ఒత్తిడిని గ్రహించి, నౌకలకు, రేవు నిర్మాణాలకు నష్టం జరగకుండా ఇవి రక్షణ కల్పిస్తాయి. సముద్ర అలల ఉధృతికి ఏదైనా పోర్టు నుంచి ఈ ఫెండర్ విడిపోయి తీరానికి చేరి ఉండవచ్చని భావిస్తున్నారు. అయితే ఇది ఏ పోర్టుకు చెందినది? ఎక్కడి నుంచి కొట్టుకొచ్చింది? అనే విషయాలు ఇంకా తెలియాల్సి ఉంది. సంబంధిత అధికారులు పరిశీలించి దాని మూలాన్ని గుర్తించాలని స్థానికులు కోరుతున్నారు.

అమలాపురం మున్సిపల్ చైర్మన్ నల్ల శ్రీధర్ ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణతో మర్యాదపూర్వక భేటీ



పి గన్నవరం నవంబర్ 11 (మీ వార్త విలేఖరి రవి) పి.గన్నవరం మండలంలోని ఎమ్మెల్యే వారి క్యాంపు కార్యాలయంలో నూతనంగా అమలాపురం మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన జనసేన పార్టీ నాయకులు శ్రీ నల్ల శ్రీధర్ పి.గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ గిడ్డి సత్యనారాయణ గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఇరువురు నాయకులు ఆత్మీయంగా మాట్లాడుకుంటూ అమలాపురం పట్టణ అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారం తదితర అంశాలపై చర్చించుకున్నారు. నూతనంగా మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన శ్రీ నల్ల శ్రీధర్ గారిని ఎమ్మెల్యే శ్రీ గిడ్డి సత్యనారాయణ అభినందించి, అమలాపురం పట్టణ సమగ్ర అభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తూ ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు

అగ్నిహోత్రం ద్వారా అనారోగ్యాలకు చికిత్స చేయొచ్చు



తాడేపల్లిగూడెం నవంబర్ 10 (మీ వార్త ప్రతినిధి) ప్రతిరోజు సూర్యోదయ, సూర్యాస్తమయాలలో అగ్నిహోత్రం చేసి ఆ సువాసన స్వీకరించటం తోనే శరీరంలో ఉన్న కొన్ని దుష్పరిమాణాలు పోతాయని ఆరా ఫౌండేషన్ యోగా గురువు కరిబండి రామకృష్ణ తెలియజేశారు. కొబ్బరి తోటలోని బోగవిల్లి రాజేశ్వరరావు, సుజాత దంపతులు వారి నివాసంలో ఈ క్రతువు ను నిర్వహించారు. ఈ క్రతువు ద్వారా దీర్ఘకాలిక రోగాలకు ఉపశమనం కలుగుతుందని, మానసిక రుగ్మతలు తొలగి ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉండడానికి దారితీస్తుందని రామకృష్ణ తెలియజేశారు. కోవిడ్ వంటి వ్యాధులను సైతం దరి చేరకుండా చేయగలిగే శక్తి ఈ అగ్నిహోత్రానికి ఉందని, వేద కాలం నుండి ఆచరిస్తున్న ఈ అగ్నిహోత్రాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలని సూచించారు. బోగవిల్లి రాజేశ్వరరావు, అపర్ణ ప్రసాద్ పలువురు వారి అనుభవాలను అగ్నిహోత్రం వల్ల కలిగే ప్రయోజనాలను పూర్వీకుల ఆచరించిన విధి విధానాలను తెలియజేశారు. ఈ క్రతువులో నున్న నాగేశ్వరరావు, రాజు, ఎల్ఐసి త్రిమూర్తులు, మరియు శిష్య బృందం పెద్ద సంఖ్యలో మహిళలు వృద్ధులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

మున్సిపల్ కమిషనర్ ఎం ఏసుబాబు



తాడేపల్లిగూడెం, నవంబర్ 11 (మీ వార్త ప్రతినిధి) మున్సిపల్ ఎన్నికలను పక్క ప్రణాళికతో పగడ్బందీగా నిర్వహించాలని పురపాలక సంఘం సిబ్బందికి కమిషనర్ ఎం.ఏసు బాబు సూచించారు. పురపాలక సంఘం సమావేశ మందిరంలో మున్సిపల్ ఎన్నికల విధులపై కమిషనర్ అధ్యక్షతన సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఎం. యేసుబాబు మాట్లాడుతూ ఎన్నికల పనులకు సంబంధించి ప్రతి సెక్షన్ బాధ్యతలను సమీక్షించి, అందరూ అప్రమత్తంగా ఉండి ఎన్నికలను ప్రశాంతంగా, పకడ్బందీగా నిర్వహించాలని కమిషనర్ ఆదేశించారు. ఎన్నికలు నిర్వహించేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామన్నారు.

ఇన్సూరెన్స్ ప్రాముఖ్యత వివరించిన కమిషనర్:
సిబ్బంది, వర్కర్లు తప్పనిసరిగా ఇన్సూరెన్స్ చేయించుకోవాలన్నారు. రూ. 2499 లు కట్టి ఇన్సూరెన్స్ తీసుకున్న వ్యక్తి ప్రమాద వసంత్ మరణిస్తే రూ. 30 లక్షలు భీమా అందించబడుతుందన్నారు. మన వర్కర్ లోనే గొడవ విజయ్ కుమార్ మరణించగా మంగళవారం ఆక్సిస్ బ్యాంక్ తరపున ఉన్న ఇన్సూరెన్స్ సొమ్మును రూ. 24 లక్షలు చెక్కును ఆయన భార్యకు అందించడం జరిగిందన్నారు. హెల్త్ ఇన్సూరెన్స్ కూడా అత్యవసరమని ప్రతి ఒక్కరూ దానిని కూడా చేయించుకోవాలని సూచించారు. ప్రమాదం ఎలా వస్తుందో ఎవరికీ తెలియదు కాబట్టి ప్రతి ఒక్కరూ తమ కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు జాగ్రత్తగా ఇన్సూరెన్స్ లు చేయించుకోవాలని అన్నారు.

వర్కర్లకు రెయిన్ కోట్లు పంపిణీ చేసిన కమిషనర్ ఏసుబాబు : తుఫాన్ నేపథ్యంలో వర్షంలోనూ వర్కర్లు పని చేస్తుండటాన్ని గమనించిన కమిషనర్, వారి ఆరోగ్యం, భద్రత దృష్ట్యా వారందరికీ రెయిన్ కోట్లు అందించాలని నిర్ణయించారు. త్వరలోనే వాటిని వర్కర్లకు అందజేయనున్నారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ డి. భవాని బాబు, మున్సిపల్ ఇంజనీర్ వై. వెంకటరమణ, అసిస్టెంట్ సిటీ ప్లానర్ జి. సీతారాం, మున్సిపల్ మేనేజర్ పి. ప్రసాద్ రావు, టౌన్ ప్లానింగ్ అధికారి వి. జగదీశ్వరరావు, స్వర్ణ వార్డు స్వర్ణ గ్రామం మేనేజర్ ఎం. నాగరాజు, శానిటేషన్ సూపర్‌వైజర్ సోమేశ్వరరావు మరియు పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన జడ్పీటీసీ తనబుద్ధి రవికిరణ్



తాడేపల్లిగూడెం, నవంబర్ 10 (మీ వార్త ప్రతినిధి) పరిషత్ ఎన్నికల్లో తాడేపల్లిగూడెం నియోజకవర్గం పెంటపాడు మండలం నుంచి జడ్పీటీసీ మెంబర్‌గా ఘన విజయం సాధించిన తనబుద్ధి రవికిరణ్ కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కూటమి తరపున జనసేన పార్టీ నుంచి పోటీ చేసి జడ్పీటీసీగా ఎన్నికైన అనంతరం తొలిసారిగా కేంద్ర మంత్రిని కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. కొత్తగా ఎన్నికైన జడ్పీటీసీ రవికిరణ్‌ను కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ ప్రత్యేకంగా అభినందించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పెంటపాడు మండల అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. జడ్పీటీసీ రవికిరణ్ తండ్రి తనబుద్ధి భోగేశ్వరరావు వాయుసేనలో సేవలందించి ప్రస్తుతం ఆలంపురంలో టీబీఆర్ సంస్థలను స్థాపించి వివిధ రకాల సేవలు అందిస్తున్నారు. టీబీఆర్ సైనిక్ స్కూల్, డిఫెన్స్ అకాడమీ వంటి విద్యా సంస్థల ద్వారా అనేకమందిని విద్యావంతులుగా తీర్చిదిద్దడంతో పాటు, సైన్యంలో ఉద్యోగ అవకాశాలు పొందేలా యువతకు తర్ఫీదు ఇస్తున్నారు. భోగేశ్వరరావు గతం నుంచి భారతీయ జనతా పార్టీలో ముఖ్య నాయకుడిగా ఉంటూ క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. జడ్పీటీసీగా ఎన్నికైన తన కుమారుడు రవికిరణ్‌తో పాటు ఆయన తండ్రి, బీజేపీ రాష్ట్ర నాయకులు తనబుద్ధి భోగేశ్వరరావు కూడా కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మను కలిసిన వారిలో ఉన్నారు.

కార్తీక మాస ప్రత్యేక ధార్మిక కార్యక్రమాలు

విశ్వహిందూ పరిషత్ -- కృష్ణా జిల్లా



మచిలీపట్నం నవంబర్ 11(మీ వార్త ప్రతినిధి) కార్తీక మాస పవిత్ర సందర్భంగా ఈరోజు ఉదయం సమస్ ఎదురుగా ఉన్న శ్రీ రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో పరమశివునికి విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించబడ్డాయి.ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ తరఫున శ్రీ జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం గారు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈరోజు సాయంత్రం ప్రత్యేక భజన కార్యక్రమం,కార్తీక మాస ధార్మిక కార్యక్రమాల్లో భాగంగా ఈరోజు సాయంత్రం 6:30 గంటలకు సర్కిల్‌పేటలోని శ్రీ సంతాన వేణుగోపాలస్వామి వారి ఆలయంలో భజనలు, భగవన్నామ సంకీర్తన కార్యక్రమం నిర్వహించబడుతుంది.భక్తులందరూ ఈ కార్యక్రమానికి విచ్చేసి, భజనల్లో పాల్గొని, భగవన్నామ స్మరణతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని భక్తిమయంగా మార్చాలని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్ సాదరంగా ఆహ్వానిస్తోంది.ధర్మ చైతన్యం -- భక్తి భావన -- సమాజ శ్రేయస్సుహర హర మహాదేవ! జై శ్రీకృష్ణ!జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం కార్యాలయ ప్రముఖ్ విశ్వహిందూ పరిషత్

108.లో. కవల శిశువులకు పునర్జన్మ!



జి.మాడుగుల(మీ వార్త ప్రతినిధి) అర్ధరాత్రి వేళ అత్యవసర పరిస్థితిలో ఉన్న గర్భిణికి 108 సిబ్బంది సమయానికి చేరుకుని ప్రసవం చేయడంతో పాటు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్న ఇద్దరు శిశువులకు సకాలంలో వైద్య సహాయం అందించారు. వివరాల్లోకి వెళితే.. జి.మాడుగుల మండలం కోరపల్లి పంచాయతీ వంట్లమామిడి గ్రామానికి చెందిన మర్రి విజయకు బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే 108కు సమాచారం అందించారు. అప్పటికే నొప్పులు తీవ్రం కావడంతో 108 వాహనం చేరకముందే ఆమె ఒక శిశువుకు జన్మనిచ్చింది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది తెల్లవారుజామున 3.30 గంటలకు గ్రామానికి చేరుకుని మరో శిశువుకు ప్రసవం చేశారు. అప్పటికే జన్మించిన తొలి శిశువు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతుండటంతో వాహనంలోని ఆక్సిజన్‌ను అందించారు. అనంతరం తల్లితో పాటు ఇద్దరు మగ శిశువులను పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. సకాలంలో స్పందించి వైద్య సహాయం అందించడంతో ఇద్దరు శిశువుల ప్రాణాలను కాపాడగలిగారు. ఈఎంటీ రామకృష్ణ, పైలట్ సాయికృష్ణ సేవలందించారు.

మితిమీరిన వేగంతో కాలువలోకి దూసుకెళ్లిన లారీ.



రౌతులపూడి నవంబర్ 11 :(మీ వార్త న్యూస్ ప్రతినిధి) రౌతులపూడిలో వేట కాలువ లోనికి వారి లారీ దూసుకెళ్లింది. సమయానికి రోడ్డుమీదనే నిత్యం నడిచే రైతులు కానీ ప్రయాణికులు కానీ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. లారీల వేగం, పరిమితికి మించిన లోడు, డ్రైవర్లు అర్హుల కాదా అనే విషయాలపై అధికారుల పర్యవేక్షణ మరియు తనిఖీలు లేకపోవడంతో ఇష్టానుసారంగా లారీల రవాణా కొనసాగుతోంది. సరసు ప్రమాదాలు జరుగుతున్న పట్టించుకునే నాధుడు లేడు. నిత్యం వందల లారీలు తిరుగుతున్న కారణంగా ప్రజలు రోడ్డు మీద ప్రయాణించాలంటే ప్రాణాలను అరిచేతిలో పెట్టుకుని ప్రయాణాలు చేస్తున్నారు. వార్తాపత్రికలలో వార్తలు వచ్చిన పట్టించుకునే అధికారులు లేకపోవడంతో లారీ ఓనర్లు మరియు డ్రైవర్లు ఇస్తాను సారంగా వ్యవహరిస్తున్నారు. రోడ్లు కూడా పూర్తిగా చిత్రమవడంతో నిత్యం ప్రయాణం చేసేవారు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఎండకాస్తి దూళి వర్షం కురిస్తే బురదమయంగా రోడ్లు తయారయ్యాయి.

మురుమూరు గ్రామానికి చెందిన సున్నం రాంబాబుకు ఏపీవోగా పదోన్నతి

ఎటూరునాగారం ఐటీడీఏలో అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా బాధ్యతల స్వీకరణ



చింతూరు,నవంబర్ 11 మీ వార్త ప్రతినిధి : పోలవరం జిల్లా ఎటపాక మండలం మురుమూరు గ్రామానికి చెందిన సున్నం రాంబాబు అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ గా పదోన్నతి పొందారు. తెలంగాణ రాష్ట్రంలోని ములుగు జిల్లా ఎటూరునాగారం ఐటీడీఏలో ఏపీవోగా బాధ్యతలు స్వీకరించనున్నారు.సున్నం రాంబాబు పదోన్నతి పొందడం పట్ల మురుమూరు గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు,రాజకీయ ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఆయనకు సోషల్ మీడియా వేదికగా ప్రత్యేక శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేస్తున్నారు.గ్రామం నుంచి ఉన్నత స్థాయికి ఎదిగి పదోన్నతి పొందడం పట్ల గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తూ,భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షిస్తున్నారు.

వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కారుమంచి



గూడూరు, నవంబర్ 11(మీ వార్త ప్రతినిధి) మండల పరిధిలోని కలపటం గ్రామంలో వివాహ మహోత్సవ వేడుకల్లో మాజీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కారుమంచి కామేశ్వరరావు పాల్గొని వధువును ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసారు.ఈ కార్యక్రమం లో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో సత్తా చాటిన విద్యార్థినికి మంత్రి కొల్లు, ఏపీఎస్ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల అభినందనలు..



మచిలీపట్నం నవంబర్ 11(మీ వార్త ప్రతినిధి) 25వ నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్--2026 పోటీల్లో ప్రథమ బహుమతి సాధించి మచిలీపట్నం ఖ్యాతిని చాటిన నిర్మల పాఠశాల విద్యార్థిని చిన్నం నవరత్న జ్యోతిని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు ఘనంగా సత్కరించి అభినందించారు. మచిలీపట్నంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆరో తరగతి 'ఏ' సెక్షన్‌లో చదువుతున్న నవరత్న జ్యోతిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. చిన్నం నాగేంద్ర వరప్రసాద్ మనవరాలైన నవరత్న జ్యోతి సాధించిన విజయంపై వారు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. గత ఆరేళ్లుగా కరాటే పోటీల్లో పాల్గొంటూ పది మందికి పైగా పతకాలు, గోల్డ్ మెడల్స్ సాధించడం సామాన్యమైన విషయం కాదన్నారు. చిన్న వయసులోనే క్రీడల పట్ల ఆసక్తి, పట్టుదలతో ఈ స్థాయి విజయాలు సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించి మచిలీపట్నం పేరును దశదిశలా వ్యాప్తి చేయాలని ఆకాంక్షించారు.ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ.. అతి చిన్న వయసులోనే కరాటేపై మక్కువ పెంచుకుని పది మందికి పైగా పతకాలు సాధించడం ఎంతో అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని విజయాలు సాధించి మచిలీపట్నానికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు.అనంతరం నవరత్న జ్యోతికి శిక్షణ అందిస్తున్న కరాటే మాస్టర్ వెంకటేశ్వరరావుతో పాటు నిర్మల పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులను మంత్రి కొల్లు రవీంద్ర ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో గొపు సత్యనారాయణ, ఎన్టీఆర్ చారిటబుల్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు చిన్నం వెంకటేశ్వరరావు, సొసైటీ కోశాధికారి చింత శ్రీనివాసరావు, మట్ట అశోక్, బచ్చుల బోసు, వాటపల్లి రమేష్, కాగిత వెంకటేశ్వరరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ కుంచే నాని, లంకె శేషగిరిరావు, బలగం విజయశేఖర్, కరాటే మాస్టర్ వెంకటేశ్వరరావు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సన్నబియ్యం అమ్మకాలపై పలు అనుమానాల



రాజోలు, నవంబర్ 11 (మీ వార్త విలేఖరి) రాజోలు మండలంలో మార్కెట్ రేట్ల కంటే తక్కువ రేట్లకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న సన్నబియ్యం అమ్మకాలపై పలు అనుమానాలు వస్తున్నట్లు తెలియవచ్చింది. ఈ మేరకు వివరాలలోకి వెళ్ళితే రాజోలు తాసిల్దార్ కార్యాలయం వద్ద కొన్ని రోజులు ప్రభుత్వం నిర్దేశించిన తక్కువ రేట్లకు అమ్మకాలు జరిగినప్పటికీ హఠాత్తుగా తాసిల్దార్ కార్యాలయం వద్ద అమ్మకాలు నిలుపుదల చేసి తాటిపాకలోని ఒక మిల్ వద్ద ప్రజలకు విక్రయిస్తున్నట్లు ప్రజల నుండి వచ్చిన సమాచారంతో రాజోలు ఎంఎస్వో కు ఫోన్ చేయ్యగా పొంతనలేని సమాధానం చెప్పడంతో రాజోలు తాసిల్దార్ మల్లేశ్వరరావు దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లగా తాసీల్దార్ వెంటనే ఎంఎస్వో ను వివరణ కోరగా మిల్ యాజమాన్యానికి ఫోన్ చేయ్యాలని ఎంఎస్వో తెలుపగా రాజోలు తాసీల్దార్ సదరు మిల్ యాజమాన్యాన్నికి ఫోన్ చేయ్యగా డిఎస్వో అనుమతితోనే మిల్ వద్ద అమ్ముతున్నట్లు తెలిపారు. దీనిపై డిఎస్వోకు విషయం తెలుపగా ఎటువంటి అనుమతి ఇవ్వలేదని, తాసీల్దార్ కార్యాలయం వద్ద, ప్రభుత్వ కార్యాలయాల వద్ద మాత్రమే విక్రయించాలని ప్రయివేటు స్థలంలో విక్రయించకూడదని, దీనిపై విచారణ జరిపిస్తామని తెలిపారు. డిఎస్వో చెప్పిన విషయాన్ని ఎంఎస్వో కు తెలపడానికి ఫోన్ చేయ్యగా ఎంఎస్వో ఫోన్ లిఫ్ట్ చేయ్యకపోవడంపై కూడా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏదిఏమైనా సంబంధిత అధికారులు వెంటనే రాజోలు తాసీల్దార్ కార్యాలయం వద్ద ప్రభుత్వం నిర్దేశించిన రేట్లకు సన్నబియ్యం అమ్మకాలను చేపట్టేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ దంపతులకు ఘన సన్మానం



మచిలీపట్నం నవంబర్ 11(మీ వార్త ప్రతినిధి) ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి తరఫున విజయం సాధించిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులందరూ ఈరోజు ఉదయం కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ గోపు సత్యనారాయణ ని ఆయన నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎన్నికల్లో విజయం సాధించిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ విజేతలందరూ గోపు సత్యనారాయణ కి, వారి సతీమణికి ఘనంగా శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి సన్మానించారు.అనంతరం గోపు సత్యనారాయణ గారు విజయం సాధించిన అభ్యర్థులందరికీ అభినందనలు తెలియజేస్తూ, ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కాకర భవాని -- కాకర కాంతారావు, ఎర్రంశెట్టి నాని, కొక్కిలిగడ్డ శ్రీను, బొలిశెట్టి నాని, పసుపులేటి నాగరాజు, వంక రమేష్, వంక నందేశ్వరరావు, వంక నాగమల్లేశ్వరరావు, వంక రాంబాబు, వీర శ్రీనివాసరావు తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవ వేడుకలు



చింతలపూడి, నవంబర్ 11 (మీ వార్త ప్రతినిధి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి, గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు, విద్యావేత్త మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ విద్యా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్య యొక్క ప్రాముఖ్యతను, సమాజ అభివృద్ధిలో విద్య పోషించే కీలక పాత్రను వివరించారు. ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్య అందుబాటులో ఉండాలని మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆశించిన విధానాన్ని గుర్తుచేశారు. విద్య అనేది కేవలం ఉద్యోగ అవకాశాలను కల్పించే సాధనం మాత్రమే కాకుండా, వ్యక్తిత్వ వికాసానికి, సామాజిక చైతన్యానికి, దేశ అభివృద్ధికి పునాది అని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదల, నైతిక విలువలను అలవర్చుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. కంప్యూటర్ శాఖ అధిపతి డాక్టర్ సౌజన్య మాట్లాడుతూ మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ దేశ విద్యారంగానికి అందించిన సేవలను, విద్యా వ్యవస్థ అభివృద్ధికి చేసిన కృషిని స్మరించుకున్నారు. విద్య ద్వారానే సమాజంలో సమానత్వం, సామరస్యం, జాతీయ సమైక్యత సాధ్యమవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం, మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

నా గెలుపుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు



పెంటపాడు ఎంపీటీసీ-2 బర్ల జయరాంబాబు మండలంలోని పెంటపాడు ఎంపీటీసీ-2 స్థానంలో వైసిపి అభ్యర్థిగా తన గెలుపుకి కృషి చేసిన ప్రతి ఒక్కరికి ఎంపీటీసీ బర్ల జయరాంబాబు మీడియా సమక్షంలో కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం జయబాబు విలేకరులతో మాట్లాడుతూ పెంటపాడు ఎంపీటీసీ-2 అభ్యర్థిగా తాను గెలుపొందడానికి వార్డు ప్రజలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, రెడ్డి,ఎస్సీ, వెలమ, కాపు, తదితర కులస్తులు కారణమని, వారి మేలును నేను ఎన్నటికి మరిచిపోనని ఆయన తెలిపారు. పెంటపాడు లోని ప్రజా సమస్యలపై పోరాడేందుకు తను సంసిద్ధంగా ఉన్నానన్నారు. గత వైసిపి పాలనలో పెంటపాడు ప్రజలకు జగన్నాధపురంలో ఇళ్ల స్థలాలు కేటాయించగా వాటిని కోర్టులో వేయడంతో ఇళ్ల స్థలాలు పంపిణీ ఆగిపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడక ముందు ప్రజలకు వారి సొంత గ్రామాల్లోనే మూడు సెంట్లు భూమిని కేటాయిస్తామని ప్రజలతో ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సెంటు భూమి ఇవ్వలేదు కదా, ఇంటిలోన్లు, ఒక్క ఫించన్ కూడా ఇవ్వలేదని ఆయన కూటమిపై మండిపడ్డారు. 18 సంవత్సరాలు దాటిన మహిళలకు ప్రతినెలా రూ. 1500 లు, 50 ఏళ్లు దాటిన ఎస్సీ కులాల వారికి ఫించన్లు, నిరుద్యోగులకు ప్రతినెల రూ 3 వేలు ఇస్తానని వారి ఓట్లతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలను మోసపుచ్చిందన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటాయన్నారు. బియ్యం, ఆయిల్, పెట్రోల్ ధరలు విపరీతంగా పెరిగాయని ఇలాగైతే సామాన్యుడు బ్రతుకు ఏమవుతుందని ప్రశ్నించారు. పెంటపాడులో మంచినీటి సమస్య ఇబ్బందికరంగా ఉందన్నారు. చెత్తను పారవేసేందుకు డంపింగ్ యార్డ్ సౌకర్యం కల్పించాలని అన్నారు. పెంటపాడు గ్రామ ప్రజల ప్రతి సమస్యను పరిష్కరించేందుకు తాను ప్రజలకు అండగా ఉంటానని వారు కూడా కలిసి వస్తే ప్రతి సమస్యపై పోరాడి ప్రజలకు న్యాయం చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానన్నారు. ఈ కార్యక్రమంలో జయ బాబు తో పాటు ఉండ్రాజవరపు రాజు, మొఖమాట్ల శ్రీనివాస్ ఉన్నారు.

అమలాపురం మున్సిపల్ చైర్మన్ శ్రీ నల్లా శ్రీధర్ ని ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలిపిన కమిషనర్ మరియు మున్సిపల్ సిబ్బంది.



అమలాపురం, మీ వార్త ప్రతినిధి, నవంబర్,11
అమలాపురం మున్సిపల్ చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన శ్రీ నల్లా శ్రీధర్ ని అమలాపురం మున్సిపల్ కమిషనర్ శ్రీ వి. నిర్మల్ కుమార్ మరియు మున్సిపల్ సిబ్బంది ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ శ్రీ నల్లా శ్రీధర్ కి పుష్ప గుచ్చాన్ని అందజేసి, శాలువాతో సత్కరించి తమ అభినందనలు తెలిపారు. అమలాపురం పట్టణ అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల వంటి అంశాల్లో మున్సిపాలిటీ మరింత ప్రగతి సాధించాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు.మున్సిపల్ చైర్మన్ శ్రీ నల్లా శ్రీధర్ పట్టణ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ, మున్సిపల్ అధికారులు మరియు సిబ్బంది సమన్వయంతో అమలాపురం పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుకు వెళ్దామని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో డీఈఈ కె .వి. సత్యనారాయణ, ఏఈలు కె.వెంకటేష్, డి . ఎస్ భాస్కర్, టీపీవో బి.రాణి సంయుక్త, మున్సిపల్ మేనేజర్ డి.ప్రభాకర రావు, అర్బన్ స్వర్ణ వార్డు ఆఫీసర్ జి.శ్రీహరి గారు, ఆర్వో బి.శ్రీలక్ష్మి , మున్సిపల్ సిబ్బంది పాల్గొని నూతన చైర్మన్ గారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

గ్రామీణ మహిళల్లో ధార్మిక చైతన్యం -- భజన సంగీత శిక్షణకు విశ్వహిందూ పరిషత్ ప్రోత్సాహం

కోసూరు దళితవాడలో 11 మంది మహిళలకు భజన వాయిద్య సంగీతంలో శిక్షణ

కోసూరు నవంబర్ 11(మీ వార్త ప్రతినిధి)
విశ్వహిందూ పరిషత్ -- కృష్ణా జిల్లా కమిటీ గ్రామీణ ప్రాంతాల్లో ధార్మిక చైతన్యాన్ని పెంపొందించడం, సంప్రదాయ భజన సంస్కృతిని పరిరక్షించడం, మహిళలను ధార్మిక కార్యక్రమాల్లో క్రియాశీలక భాగస్వాములుగా తీర్చిదిద్దడం లక్ష్యంగా విశ్వహిందూ పరిషత్ కృష్ణా జిల్లా కమిటీ చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా మొవ్వ మండలం కోసూరు గ్రామంలోని దళితవాడలో ఒక మంచి ప్రయత్నం ప్రారంభమైంది. కోసూరు గ్రామంలోని దళితవాడకు చెందిన 11 మంది మహిళలు మాదిరి కిరణ్ బాబు నాయకత్వంలో భజన కార్యక్రమాలకు అవసరమైన వాయిద్య సంగీతంలో శిక్షణ పొందుతున్నారు. భజనల్లో ఉపయోగించే వాయిద్యాలను స్వయంగా నేర్చుకుంటూ, సమష్టిగా సంగీత సాధన చేస్తున్నారు. భక్తి సంగీతంపై ఆసక్తి కలిగిన మహిళలు ముందుకు వచ్చి ఈ శిక్షణలో పాల్గొనడం విశేషం.జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం ప్రత్యేక చొరవఈ కార్యక్రమం ప్రారంభమై కొనసాగడంలో విశ్వహిందూ పరిషత్ కృష్ణా జిల్లా కార్యాలయ ప్రముఖ్ జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం కీలక పాత్ర పోషించారు. ఆయన కోసూరు మహిళలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ, వారిని వ్యక్తిగతంగా ప్రోత్సహించి, భజన సంగీత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అవసరమైన ప్రేరణ కల్పించారు.కేవలం ఒక కార్యక్రమాన్ని నిర్వహించడంతోనే పరిమితం కాకుండా, మహిళల్లో ఆసక్తిని పెంపొందించి, వారే స్వయంగా భజన బృందంగా ఏర్పడి గ్రామంలో ధార్మిక కార్యక్రమాలను నిర్వహించే స్థాయికి ఎదగాలనే ఉద్దేశంతో ఆయన ఈ ప్రయత్నానికి చొరవ చూపారు. మాదిరి కిరణ్ బాబు నాయకత్వంలో 11 మంది మహిళలు శిక్షణ పొందుతూ ఈ ప్రయత్నాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు.మహిళల భాగస్వామ్యంతో ధార్మిక చైతన్యంభారతీయ సనాతన ధర్మ సంప్రదాయంలో భజన, కీర్తనలకు విశిష్టమైన స్థానం ఉంది. భజన అనేది కేవలం సంగీత కార్యక్రమం మాత్రమే కాదు. అది భక్తిని పెంపొందించే సాధనం, కుటుంబాలను మరియు సమాజాన్ని అనుసంధానించే ఆధ్యాత్మిక వేదిక.ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు భజన సంగీతాన్ని నేర్చుకుని, స్వయంగా భజన కార్యక్రమాలను నిర్వహించడం వల్ల స్థానికంగా ధార్మిక కార్యక్రమాలకు కొత్త ఉత్సాహం లభిస్తుంది. మహిళల్లో ఆత్మవిశ్వాసం పెరగడంతో పాటు, సంప్రదాయ కళలు మరియు భక్తి సంగీతం తరువాతి తరాలకు అందే అవకాశం ఏర్పడుతుంది.గ్రామగ్రామాన భజన బృందాల ఏర్పాటు లక్ష్యం,విశ్వహిందూ పరిషత్ కృష్ణా జిల్లా కమిటీ గ్రామీణ



ప్రాంతాల్లో ధార్మిక చైతన్య కార్యక్రమాలను విస్తరించడంలో మహిళల భాగస్వామ్యానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంది.కోసూరులో ప్రారంభమైన ఈ ప్రయత్నం మరిన్ని గ్రామాలకు స్ఫూర్తిగా నిలవాలని, గ్రామాల్లో మహిళా భజన బృందాలు ఏర్పడాలని కమిటీ ఆకాంక్షిస్తోంది.ప్రతి గ్రామంలో మహిళలు భజన, కీర్తన, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనే వాతావరణం ఏర్పడితే ధార్మిక సంప్రదాయాల పరిరక్షణతో పాటు సామాజిక ఐక్యత, పరస్పర సౌభ్రాతృత్వం, సమరసత మరింత బలోపేతం అవుతాయి.కోసూరు దళితవాడలో 11 మంది మహిళలతో ప్రారంభమైన ఈ చిన్న ప్రయత్నం, భవిష్యత్తులో కృష్ణా జిల్లావ్యాప్తంగా మహిళా భజన బృందాల ఏర్పాటుకు ఒక స్ఫూర్తిదాయక నమూనాగా ఎదగాలని విశ్వహిందూ పరిషత్ కృష్ణా జిల్లా కమిటీ ఆశిస్తోంది.ధార్మిక చైతన్యం న మహిళా భాగస్వామ్యం న భజన సంప్రదాయాల పరిరక్షణ న సామాజిక సమరసత,విశ్వహిందూ పరిషత్ -- కృష్ణా జిల్లా కమిటీ

దేశసేవ నుంచి ప్రజా సేవకు సంసిద్ధం





పుల్లలచెరువు, నవంబర్ 11 (మీ వార్త) దేశ రక్షణ కోసం భారత సైన్యంలో సేవలందించిన మాజీ సైనికుడు దాసి వెంకటేశ్వరరావు (ఆర్మీ బుజ్జి) ప్రస్తుతం గ్రామ ప్రజలకు సేవ చేసేందుకు సిద్ధమయ్యారు. రానున్న పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.
గతంలో ఫ్రెండ్స్ సర్వీస్ సంస్థ ద్వారా గ్రామంలో మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. పర్యావరణ పరిరక్షణ, సామాజిక సేవా కార్యక్రమాల్లో తనవంతు బాధ్యతగా పలు కార్యక్రమాలు నిర్వహించినట్లు వివరించారు.

హైదరాబాద్‌కు ఆర్టీసీ బస్సు ఏర్పాటు
పుల్లలచెరువు నుంచి హైదరాబాద్‌కు ప్రయాణించే ప్రజలు ఎదుర్కొంటున్న రవాణా సమస్యలను గుర్తించి, సంబంధిత ఆర్టీసీ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అధికారులతో మాట్లాడి పుల్లలచెరువు నుంచి హైదరాబాద్‌కు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేయించేందుకు కృషి చేసినట్లు పేర్కొన్నారు. ప్రజల ప్రయాణ అవసరాలను గుర్తించి, రవాణా ఇబ్బందులు తగ్గించాలనే ఉద్దేశంతో ఈ ప్రయత్నం చేసినట్లు వివరించారు.

ప్రజా సౌకర్యాలకు సొంత నిధులతో పనులు
ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం సొంత నిధులతో మరుగుదొడ్లు ఏర్పాటు చేయడంతో పాటు, బస్టాండ్ పరిసరాల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు వంటి పనులు చేపట్టినట్లు స్థానికులు తెలిపారు. ప్రజలకు అవసరమైన సౌకర్యాల కల్పనలో తనవంతు సహకారం అందించినట్లు పేర్కొన్నారు.

గ్రామాభివృద్ధే లక్ష్యం
గ్రామంలో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు, తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, రహదారులు తదితర మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తానని వెంకటేశ్వరరావు తెలిపారు. సైన్యంలో పనిచేసిన సమయంలో అలవర్చుకున్న క్రమశిక్షణ, సేవాభావంతో గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు.
గ్రామ ప్రజలు తనపై నమ్మకం ఉంచి, ఆశీర్వదించి, గ్రామాభివృద్ధికి సేవ చేసే అవకాశం కల్పించాలని కోరారు. ప్రజలు అవకాశం ఇస్తే గ్రామ సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తానని, గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని దాసి వెంకటేశ్వరరావు (ఆర్మీ బుజ్జి) విజ్ఞప్తి చేశారు.

వైసీపీ తరుపున ఎన్నికయిన ఎంపీటీసీ లకు సత్కారం



రాజోలు, నవంబర్ 11 (మీ వార్త ప్రతినిధి) నియోజకవర్గ పరిధిలోని మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురం గ్రామంలో మండలం లో వైసీపీ తరపున ఘన విజయం సాధించిన ఎంపీటీసీ సభ్యులను రాజోలు నియోజకవర్గం వైసిపి ఇంచార్జి మాజీ శాసన సభ్యురాలు శ్రీమతి పాముల రాజేశ్వరి దేవి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ మీకు అండగా ఉంటుందని, వారికి భరోసా కల్పించారు.స్థానిక సంస్థల ఎన్నికలలో స్వల్ప తేడాతో ఓటమి చెందిన ఎంపీటీసీ అభ్యర్థులకు ప్రత్యేకంగా మనోధైర్యం కల్పించి, పార్టీ వారి వెంటే ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసి బల్ల ప్రసన్న , పాముల దేవిప్రకాష్ , గుర్రం జాషువా, గుబ్బల సత్యనారాయణ, గుబ్బల రమేష్, గుబ్బల సింహాచలం, నల్లి శివకుమార్, ఏనుమల నారాయణ స్వామి, గంగభవాని, బుచ్చియ్య మాస్టారు, గెడ్డం ఆంజనేయులు తదితర పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించిన

ఆంధ్రప్రదేశ్ మానవ హక్కుల ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోవాడ ప్రశాంతి



మచిలీపట్నం నవంబర్ 11(మీ వార్త ప్రతినిధి) మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని ఈరోజు కృష్ణా జిల్లా మచిలీపట్నం కార్యాలయంలో ఆయన జయంతి వేడుకలను ఆంధ్రప్రదేశ్ మానవ హక్కుల ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోవాడ ప్రశాంతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, మౌలానా అబుల్ కలాం ఆజాద్ భారత స్వాతంత్ర్య సమరంలో కీలక పాత్ర పోషించిన మహనీయుడని, స్వతంత్ర భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా దేశ విద్యారంగ అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. విద్య ద్వారానే సమాజంలో సమానత్వం, సామాజిక చైతన్యం, అభివృద్ధి సాధ్యమవుతాయని విశ్వసించిన ఆయన ఆశయాలు నేటికీ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.దేశ ఐక్యత, సమగ్రత, మతసామరస్యం, విద్యా వికాసం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, భావితరాలకు ఆయన జీవితం, ఆశయాలు మార్గదర్శకంగా నిలుస్తాయని ఈ సందర్భంగా స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్వాడీ కార్యకర్తలకు రెండు రోజుల ప్రత్యేక శిక్షణ ముగింపు.





అనంతగిరి,నవంబర్ 11 (మీ వార్త) స్థానిక మండల కేంద్రంలో అంగన్వాడీ కార్యకర్తల కోసం ఏర్పాటు చేసిన రెండు రోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమం మంగళవారం ముగిసింది.అనంతగిరి సీడీపీఓ వై.లావణ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.బోధనా పద్ధతులు:చిన్నారుల ప్రాథమిక విద్యాభివృద్ధి కోసం స్థానికంగా లభించే వనరులతో బోధనోపకరణాల తయారీపై అవగాహన కల్పించారు.పిల్లల ఎదుగుదల పర్యవేక్షణ,పోషకాహార లోపాల (శామ్,మామ్) గుర్తింపు,ఆరోగ్య పరిరక్షణ అంశాలపై వివరించారు.

సేవల బలోపేతం:
గర్భిణులు,బాలింతలు,చిన్నారులకు మెరుగైన సేవలు అందించడం,ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో సమాజ భాగస్వామ్యం పెంచడంపై దిశానిర్దేశం చేశారు.గ్రామీణ,గిరిజన ప్రాంతాల్లో మాతాశిశు సంక్షేమ సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు,సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఒకే సమయంలో రెండు రాష్ట్రాల సమ్మిట్‌లు

హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాల మధ్య పారిశ్రామిక , పెట్టుబడుల సాధనలో సరికొత్త పోటీ వాతావరణం నెలకొంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు దాదాపు ఒకే సమయంలో మెగా పెట్టుబడుల సదస్సులు నిర్వహిస్తున్నాయి. తెలంగాణలోని రేవంత్ రెడ్డి సర్కారు హైదరాబాద్ వేదికగా నవంబర్ 12 నుంచి 14 వరకు మూడు రోజుల పాటు భారత్ సమ్మిట్ నిర్వహిస్తుండగా.. అటు ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖపట్నం వేదికగా ప్రతిష్టాత్మక 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు ను నిర్వహిస్తోంది. రెండు రాష్ట్రాల సదస్సుల పేర్లు, వేదికలు వేరైనా.. వాటి అంతిమ లక్ష్యం మాత్రం ప్రపంచ పారిశ్రామిక దిగ్గజాలను ఆకర్షించి, వేల కోట్ల రూపాయల పెట్టుబడులను ఒడిసిపట్టడమే.ఒకే సమయంలో రెండు భారీ సమ్మిట్‌లు జరగనుండటంతో సహజంగానే కార్పొరేట్ వర్గాల్లో, మీడియాలో పోలికలు మొదలయ్యాయి. ఏ సమ్మిట్‌కు ఎలాంటి గ్లోబల్ దిగ్గజాలు హాజరవుతున్నారు? ఏ రాష్ట్రానికి ఎన్ని లక్షల కోట్ల విలువైన అవగాహన ఒప్పందాలు కుదురుతున్నాయి? అన్న విషయాలపై అంచనాలు సాగుతున్నాయి. హైదరాబాద్ సమ్మిట్‌కు అంతర్జాతీయ ప్రతినిధులతో పాటు జాతీయ స్థాయి కార్పొరేట్ నెట్‌వర్క్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం ఆహ్వానిస్తుండగా.. విశాఖ

అనంతగిరి ఎంపీపీ పీఠంపై తెగని పంచాయితీ..! ఆశావహుల్లో నెలకొన్న ఉత్కంఠ.





అనంతగిరి,నవంబర్ 11 (మీ వార్త) అనంతగిరి మండల ప్రజాపరిషత్ (ఎంపీపీ) అధ్యక్ష పీఠాన్ని దక్కించుకునేందుకు జరుగుతున్న రాజకీయ సమీకరణాలు రోజుకో మలుపు తిరుగుతున్నాయి.పీఠం దక్కేది ఎవరికి అనే అంశంపై స్పష్టత రాకపోవడంతో అధికార,ప్రతిపక్ష శిబిరాల్లో ఉత్కంఠ తీవ్రరూపం దాల్చింది. ఆశావహులైన నాయకులు తమకే ఎంపీపీ పదవి దక్కుతుందన్న ధీమాతో ఉన్నప్పటికీ,అధిష్ఠానం నిర్ణయంపైనే సర్వత్రా ఆసక్తి నెలకొంది.

రంగంలోకి దిగిన ఆశావహులు.

మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ (ఎంపీటీసీ) ఎన్నికల ఫలితాల అనంతరం ఎంపీపీ పీఠాన్ని సొంతం చేసుకునేందుకు బలమైన అభ్యర్థులు శ్రమిస్తున్నారు.తమ సామాజిక వర్గం, పార్టీకి చేసిన సేవలు,స్థానిక సమీకరణాలను అధిష్ఠానం ముందుంచుతూ కీలక నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.ప్రధానంగా ముగ్గురు సీనియర్ నాయకులు ఈ రేసులో ముందంజలో ఉన్నట్లు సమాచారం.తమ మద్దతుదారులైన ఎంపీటీసీలను తమ వైపు తిప్పుకునేందుకు క్యాంపు రాజకీయాలు కూడా జోరందుకున్నట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది.

తెగని పంచాయితీ.

ఎంపీపీ ఎంపికపై పలుమార్లు అంతర్గత సమావేశాలు నిర్వహించినప్పటికీ,అభ్యర్థిత్వంపై ఏకాభిప్రాయం కుదరకపోవడంతో పంచాయితీ కొలిక్కి రాలేదు..పోటీ తీవ్రత:-ఇరువర్గాలు పట్టుదలతో ఉండటంతో ఏ ఒక్కరినీ ఒప్పించడం అధిష్ఠానానికి సవాలుగా మారింది..అసమ్మతి భయం:-ఒకరికి పదవి ఇస్తే మరొక వర్గం తిరుగుబాటు చేసే అవకాశం ఉండటంతో నాయకత్వం జాగ్రత్తగా అడుగులు వేస్తోంది..పార్టీ పెద్దల వ్యూహం:-మండలంలోని అన్ని వర్గాలను బ్యాలెన్స్ చేస్తూ,రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అభ్యర్థిని ప్రకటించాలని అధిష్ఠానం భావిస్తోంది.

క్యాంపుల్లో ఉత్కంఠ -- నేతల్లో ఆందోళన.

పంచాయితీ తేలకపోవడంతో ఎంపీటీసీ సభ్యులతో పాటు,వారి మద్దతుదారులు తీవ్ర ఉత్కంఠకు గురవుతున్నారు.సోషల్ మీడియాలో సైతం ఎవరికి వారే మా నాయకుడే ఎంపీపీ" అంటూ ప్రచారాలు చేసుకుంటున్నారు.ఏ క్షణంలో ఏం జరుగుతుందో,అధిష్ఠానం ఎవరికి ముద్ర వేస్తుందో తెలియక ఆశావహుల్లో ఆందోళన నెలకొంది.మరి అనంతగిరి ఎంపీపీ పీఠం ఎవరిని వరిస్తుందో,ఈ పొలిటికల్ సస్పెన్స్‌కు ఎప్పుడు తెరపడుతుందో వేచి చూడాల్సిందే..!

నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధికి కృషి చేయాలి

పరిషత్ ఎన్నికల్లో విజయం సాధించిన ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులకు హోం మంత్రి అనిత పిలుపు

పాయకరావుపేట, నవంబరు 11 , మీ వార్త ప్రతినిధి,ఇటీవల జరిగిన పరిషత్ ఎన్నికల్లో విజయం సాధించిన ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులతో హోం మంత్రి వంగలపూడి అనిత బుధవారం నక్కపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. విజయం సాధించిన ప్రజాప్రతినిధులకు అభినందనలు తెలియజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ... పరిషత్ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కష్టపడి పనిచేయడం వల్లే కూటమి అద్భుత విజయాలు సాధించిందన్నారు. కోటవురట్ల మండలంలో రికార్డు స్థాయిలో విజయం సాధించామని, 60 సంవత్సరాల చరిత్రను బద్దలు కొట్టి సరికొత్త రికార్డు సృష్టించామని పేర్కొన్నారు. తంగేడు గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఎస్.రాయవరం మండలంలో ఒక్క స్థానం మినహా మిగిలిన అన్ని స్థానాల్లో కూటమి విజయం





సాధించిందని, పాయకరావుపేటలో బీజేపీ జడ్పీటీసీ స్థానాన్ని కైవసం చేసుకున్నామని తెలిపారు. అనకాపల్లి జిల్లాలో మొత్తం 24 జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలను కూటమి గెలుచుకోవడం సంతోషకరమన్నారు. ప్రతి ఒక్కరూ తమ తమ సెగ్మెంట్లలో ప్రజలకు అందుబాటులో ఉంటూ, స్థానిక సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు కృషి చేయాలని సూచించారు. ఇదే ఐక్యత, ఇదే స్ఫూర్తితో రానున్న పంచాయతీ ఎన్నికల్లోనూ కూటమి విజయపరంపర కొనసాగించేలా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. విజయం సాధించిన ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులకు హోం మంత్రి అనిత స్వయంగా భోజనాలు వడ్డించారు. సభ్యులను ఆప్యాయంగా పలకరిస్తూ వారితో కలిసి ఆత్మీయంగా ముచ్చటించారు. మంత్రి చూపిన అభిమానానికి ప్రజాప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారు.

టిడిపి పై జనసైనికుల ఆగ్రహం

మున్సిపల్ ఎన్నికలలో ఫ్రెండ్లీ పోటీకి తాము సిద్ధం
ముళ్ళపూడి బాపిరాజు వెంటనే ఎమ్మెల్యే బొలిశెట్టి క్షమాపణలు చెప్పాలి

తాడేపల్లిగూడెం నవంబర్ 11 (మీ వార్త ప్రతినిధి) ఇటీవల జరిగిన ఎంపిటిసి జడ్పిటిసి ఎన్నికలలో తాడేపల్లిగూడెం మండలంలోని వెంకట్రామన్నగూడెం ఎంపీటీసీ (టీడీపీ) అభ్యర్థిగా పోటీ చేసిన పరిమి రవికుమార్ ఓటమికి ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పై టిడిపి నాయకులు నిరాధార ఆరోపణలు చేయడం పట్ల జనసైనికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం తాడేపల్లిగూడెం పట్టణంలోని గుణ్ణం వేణుగోపాల్ ఫంక్షన్ హాల్లో జనసేన కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడుతూ పరిమి రవికుమార్ ను గెలిపించుకోవడం కోసం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ వెంకట్రామన్నగూడెంలో ప్రచారం నిర్వహించడం వాస్తవం కాదా అని టిడిపి నాయకులను ప్రశ్నించారు. రవి కోసం ప్రచారం చేస్తూ ఎంపీపీ అభ్యర్థిగా రవిని ప్రకటించిన మాట వాస్తవం కాదా అన్నారు. టిడిపి ఇన్చార్జ్ వలవల బాబ్జి కానీ, టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు ముళ్ళపూడి బాపిరాజు కానీ ఏ ఒక్క రోజైనా రవి కోసం ప్రచారం చేపట్టారా అంటూ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. టిడిపి అభ్యర్థి బరిలో ఉంటే దగ్గరుండి ప్రచారం చేయాల్సిన బాధ్యత మీకు లేదా అంటూ నిలదీశారు. ఈ వ్యవహారంలో ఎమ్మెల్యే బొలిశెట్టి కి ఆపాదించడం సరికాదన్నారు. గాజు గ్లాసు గుర్తుపై పోటీ చేసిన జనసేన అభ్యర్థులను ఓడించింది మీరు కాదా అని ప్రశ్నించారు. నందమూరులో జనసేన అభ్యర్థిని ఓటమికి కారణం టిడిపి నాయకుడు శనగణ శ్రీనివాస్ గౌడ్ కాదా, అతను కూటమిలో ఉంటూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయమని చెప్పడం వాస్తవం కాదా అని మండిపడ్డారు. జగన్నాధపురం-2 లో బిజెపి అభ్యర్థి ఓటమికి టిడిపి నాయకుడు,ఏఎంసి వైస్ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ వైసిపి తో అంట కాగిన మాట వాస్తవం కాదా అన్నారు. పట్టిపాలెంలో బోళ్ల వెంకట సుబ్బారావు టిడిపి అభ్యర్థి ఓటమికి టిడిపి నాయకులే కారణం కాదా అని గుర్తు చేశారు. ఆకుతీగపాడులో జనసేన అభ్యర్థిని ఓటమికి బోడపాడు టిడిపి నాయకులు వైసీపీతో రహస్య ఒప్పందం కాదా అని మండిపడ్డారు. కూటమిలో ఉంటూ కూటమి ధర్మానికి తూట్లు పొడిచిన మీరు ఈ రకమైన ఆరోపణలు చేయడం తగదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రధాని మోడీ ఆశయ సాధనకు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ నిరంతరం కృషి చేస్తున్నారని గుర్తు చేశారు. కానీ టిడిపి జిల్లా అధ్యక్షులు మంతెన రామరాజు ఎమ్మెల్యే పై అసత్య ఆరోపణలు తగదని మండిపడ్డారు. టిడిపి ఇన్చార్జి వలవల బాబ్జి ఇష్టానుసారం మాట్లాడుతూ ఎమ్మెల్యే పై అనుచిత వ్యాఖ్యలు చేయడం కూటమి ధర్మానికి తూర్పు పడవడమే అన్నారు. టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు ముళ్ళపూడి బాపిరాజు ఎమ్మెల్యే పై మాట్లాడిన తీరును మార్చుకోకపోతే తామంతా





అతనికి తగిన బుద్ధి చెప్తామని ముక్తకంఠంతో వివరించారు. ముళ్ళపూడి బాపిరాజు జెడ్పిటిసి గా తాడేపల్లిగూడెం మండలం లో పోటీ చేసినప్పుడు తామంతా అతనికి అండగా ఉన్నామన్నారు. జడ్పీ చైర్మన్ గా కొనసాగిన సమయంలో బిజెపితో బాపిరాజు తగవులు పడినప్పుడు అతనికి వెన్నుదన్నుగా నిలిచింది ఆనాటి మున్సిపల్ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాస్ కాదా అని గర్జించారు. ముళ్ళపూడి బాపిరాజు వెంటనే ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కు బహిరంగ క్షమాపణలు చెప్పాలని జన సైనికులు ముక్తకంఠంతో నినదించారు. రానున్న మున్సిపల్ ఎన్నికలలో స్నేహపూర్వక పోటీ చేస్తామని టిడిపి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అంగీకరిస్తే తాము స్నేహపూర్వక పోటీకే కాదు ప్రత్యక్ష పోటీకి కూడా సిద్ధంగా ఉన్నామని జనసైనికులు టిడిపిని హెచ్చరించారు. రాష్ట్రంలో కూటమి పొత్తు కొనసాగాలంటే నియోజకవర్గాలలో కూడా పొత్తు ధర్మం పాటించాలన్నారు. ఇదే పరిస్థితి మిగిలిన నియోజకవర్గాలలో జరిగితే కూటమి పరిస్థితి ఏమవుతుందని ఇక్కడ టిడిపి నాయకులు గుర్తించాలని వారికి జనసైనికులు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పెంటపాడు జడ్పిటిసి తనబుద్ధి రవికిరణ్, పైబోయిన రఘు, వర్తనపల్లి కాశి, పుల్లా బాబీ, అడపా ప్రసాద్, సజ్జా సుబ్బు, చాపల రమేష్, నీలపాల దినేష్ యాదవ్, పాలూరి వెంకటేశ్వరరావు, సిద్ధా వీర్రాజు, మద్దాల మణికుమార్, గట్టిం నాని, బొడ్డు సాయి బాబా, అడ్వకేట్ మాకా శ్రీనివాసరావు, నూతనంగా ఎంపికైన ఎంపీటీసీలు, పోటీ చేసిన ఎంపీటీసీ అభ్యర్థులు,వీర మహిళలు, జన సైనికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

10 నెలల వయసు కలిగిన శిశు గృహా లో ఆశ్రయం పొందుతున్న బేబీ స్ఫూర్తి అనే బాలికను కేరళ రాష్ట్రము,



ఏలూరు, నవంబర్, 11 : 10 నెలల వయసు కలిగిన శిశు గృహా లో ఆశ్రయం పొందుతున్న బేబీ స్ఫూర్తి అనే బాలికను కేరళ రాష్ట్రము, తిరువనంతపురం జిల్లా వారు శ్రీ రాజశేఖర్ కె.వి సుజిత దంపతులకు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి బుధవారం దత్తతతో అందజేశారు. సుమారుగా మూడు సంవత్సరముల క్రితం మిషన్ వాత్సల్య పోర్టల్ లో పిల్లల దత్తత కొరకు దరఖాస్తు చేసుకోగా వారికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఏలూరు జిల్లా శిశు గృహాలో ఉన్న బేబీ స్ఫూర్తి రిఫరల్ వెళ్ళటం జరిగింది. వారి యొక్క దరఖాస్తు మరియు సంబంధిత డాక్యుమెంట్స్ అన్ని సరి చూసిన తర్వాత జిల్లా కలెక్టర్ మరియు బుధవారం దత్తత తల్లిదండ్రులకు బేబీ స్ఫూర్తిని అందించడం జరిగినది. బేబీ స్ఫూర్తిని జాగ్రత్త గా ప్రేమగా కన్నబిడ్డలాగా చూసుకోవాలని,పాపకి విద్య నేర్పించి అభివృద్ధిలోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి డాక్టర్ సిహెచ్ సూర్య చక్రవేణి, శిశు గృహ మేనేజర్ భార్గవి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రథమ ప్రాధాన్యం



అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం
అధికారులకు ఎమ్మెల్యే బడేటి చంటి ఆదేశాలు
అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించి, పేదలకు ఆర్థిక భరోసా కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు.ఏలూరులోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఆయన, సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించిన ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ :

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, సంక్షేమం, అభివృద్ధితో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్



పెంటపాడు నవంబర్ 11 (మీ వార్త ప్రతినిధి) విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. బుధవారం పెంటపాడు మండలంలోని ప్రత్తిపాడు సెయింట్ మేరీస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో పాఠశాల 40 వార్షికోత్సవ దినోత్సవాన్ని పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ కమల్ రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ హాజరయ్యారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు, వివిధ కళారూపాలు, వారి ప్రతిభాపాటవాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు ఇలాంటి వార్షికోత్సవ వేడుకలు ఎంతగానో దోహదపడతాయన్నారు. విద్యతో పాటు క్రమశిక్షణ, సంస్కారం, ఆత్మవిశ్వాసం మరియు సృజనాత్మకతను అలవర్చుకుంటూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమం అనంతరం ఉత్తమ విద్యార్థులకు, వివిధ పోటీలలో గెలుపొందిన వారికి జ్ఞాపికతోపాటు బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో జడ్పిటిసి తనబుద్ధి రవికిరణ్, ఎంఈఓ-2 టీవీ రామకృష్ణ, వివిధ విచారణల నుండి గురువులు, ఎన్డీఏ కూటమి నాయకులు, స్థానిక నాయకులు, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శ్రీ ప్రకాష్ లో ఉల్లాసంగా ఉత్సాహంగా రిమ్ జిమ్

ఆకట్టుకుంటున్న విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు





పాయకరావుపేట, నవంబరు 11 (మీ వార్త ప్రతినిధి) : శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలో జరుగుతున్న రిమ్ జిమ్ వేడుకల్లో విద్యార్థులు ఉల్లాసంగా ఉత్సాహంగా పాల్గొంటున్నారు. విద్యార్థుల మధ్య నిర్వహిస్తున్న పోటీలు ఆసక్తికరంగా జరుగుతున్నాయి. ఈ పోటీల్లో శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల తుని, పాయకరావుపేట, అన్నవరం శాఖలకు చెందిన 5,800 మంది విద్యార్థులు పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమంలో సాహిత్యం, సంగీతం, ఆటలు, క్రీడలు, లలిత కళలు, థియేటర్ ఆర్ట్స్, సైన్స్ వంటి అనేక అంశాల మీద జూనియర్, సబ్ జూనియర్, సీనియర్, సూపర్ సీనియర్ విభాగాలలో 31 రకాల పోటీలు నిర్వహిస్తున్నామని విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్ ప్రకాష్ తెలిపారు. విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభా పాటవాలను వెలికి తీసేందుకు ప్రతీ సంవత్సరం ఈ రిమ్ జిమ్ క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 14వ తేదీన జరిగే రిమ్ జిమ్ ముగింపు ఉత్సవాల్లో విజేతలకు బహుమతులు ప్రధానం అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ప్రిన్సిపల్ ఎం.వి.వి.ఎస్. మూర్తి, ప్రోగ్రాం కన్వీనర్ గౌతమి, అకడమిక్ ఇంచార్జిలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తోన్న పాత నేరస్థుడు అరెస్టు

విశాఖపట్నం సెంట్రల్ జైలుకు తరలించిన పాయకరావుపేట పోలీసులు

పాయకరావుపేట, నవంబరు 11 (మీ వార్త ప్రతినిధి) : గంజాయి అక్రమ రవాణా చేస్తూ విక్రయాలకు పాల్పడుతూ పదేపదే నేరాలకు పాల్పడుతున్న పాత నేరస్థుడిపై పాయకరావుపేట పోలీసులు పీఐటీ ఎన్డీపీఎస్ చట్టం ప్రయోగించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన నిర్బంధ ఉత్తర్వుల మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకుని విశాఖపట్నం సెంట్రల్ జైలుకు తరలించారు. పూర్తి వివరలిలా ఉన్నాయి... నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలోని శివపురానికి చెందిన గొర్లి నానాజీ అలియాస్ నాయుడు (27) గంజాయి అక్రమ రవాణా కేసుల్లో గతంలోనూ నిందితుడిగా ఉన్నాడు. ఇతనిపై నర్సీపట్నం రూరల్ పోలీస్ స్టేషన్‌లో 2018లో కేసు నమోదైంది. చింతపల్లి- నర్సీపట్నం రహదారిలోని నెల్లిమెట్ట వద్ద వ్యాన్‌లో పనసకాయల మాటున ఒడిశాకు తరలిస్తున్న 560 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో నానాజీ మూడో నిందితుడిగా ఉండగా, ప్రస్తుతం విశాఖపట్నం మొదటి అదనపు జిల్లా జడ్జి కోర్టులో విచారణ కొనసాగుతోంది. 2025 ఫిబ్రవరి 21న పాయకరావుపేట మండలం, పెద్దిరాజు పాలెం గ్రామ శివారులోని సూదికొండ సమీపంలో విక్రయించేందుకు తుప్పల్లో దాచిన 600 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో గంజాయికి కాపలాగా ఉంటూ, నగదు లావాదేవీల్లో కీలక పాత్ర పోషించిన నానాజీని మూడో నిందితుడిగా అరెస్టు చేశారు. ప్రస్తుతం ఈ కేసు దర్యాప్తులో ఉంది. గతంలో కేసులు నమోదైనప్పటికీ తన ప్రవర్తన మార్చుకోకుండా గంజాయి అక్రమ వ్యాపారంలో కొనసాగుతుండటంతో అతని కార్యకలాపాలను అరికట్టేందుకు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఐపీఎస్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. దీనిని పరిశీలించిన ప్రభుత్వం పీఐటీ ఎన్డీపీఎస్ చట్టం 1988లోని సెక్షన్ 3(1) కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు పాయకరావుపేట సీఐ ఎం వినోద్ బాబు, ఎన్డీపీఎస్ సెల్ సురేష్ పర్యవేక్షణలో ఎస్సై పురుషోత్తం, పోలీసు సిబ్బంది నిందితుడిని అదుపులోకి తీసుకుని విశాఖపట్నం సెంట్రల్ జైలుకు తరలించారు.



జిల్లాలో గంజాయి సాగు, రవాణా, నిల్వ, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు హెచ్చరించారు. నేర ప్రవృత్తిని విడనాడకుండా ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే గంజాయి అక్రమ వ్యాపారానికి పాల్పడితే పీడీ యాక్ట్, పీఐటీ ఎన్డీపీఎస్ చట్టాల కింద నిర్బంధ చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

పెడన నియోజకవర్గంలో వైసీపీకి మరో ఎదురుదెబ్బ.. టీడీపీలోకి 30 మంది కార్యకర్తలు చేరిక!

పెడన నవంబర్ 11(మీ వార్త ప్రతినిధి)
పెడన నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి రోజురోజుకూ ప్రజాదరణ పెరుగుతుండగా, ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు టీడీపీ వైపు అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలో పెడన నియోజకవర్గం బంటుమిల్లి మండలం రామవరపుమోడీ పంచాయతీ పరిధిలోని పల్లికొండవారి మోడీ గ్రామానికి చెందిన 30 మంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఈరోజు సాయంత్రం తెలుగుదేశం పార్టీలో చేరారు. పెడన నియోజకవర్గం శాసనసభ్యులు శ్రీ కాగిత కృష్ణ ప్రసాద్ సమక్షంలో వీరంతా తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పుకొని పార్టీలోకి సాదరంగా చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు నూతనంగా పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన కార్యకర్తలు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నాయకత్వంపై నమ్మకంతో, ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు పాలనపై విశ్వాసంతో తెలుగుదేశం పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం, ప్రజా సంక్షేమం కోసం ఎమ్మెల్యే శ్రీ కాగిత కృష్ణ ప్రసాద్ నాయకత్వంలో



కలిసికట్టుగా పనిచేస్తామని తమ ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ కాగిత కృష్ణ ప్రసాద్ గారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం, గుర్తింపు ఉంటాయని తెలిపారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పల్లికొండవారి మోడీ గ్రామం నుంచి 30 మంది కార్యకర్తలు టీడీపీలో చేరడం బంటుమిల్లి మండలంలో పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. జై తెలుగుదేశం! జై చంద్రబాబు! జై కాగిత!

పద్మశాలి భవన నిర్మాణానికి రూ.5 కోట్లు కేటాయించిన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు

జిల్లా, మండల కేంద్రాల్లోనూ పద్మశాలీల ఆత్మగౌరవ భవనాలకు స్థలాలు, నిధులు కేటాయించాలి

జీవో నంబర్ 14ను రద్దు చేయాలి.. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు

మంచిర్యాల : తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని కోకాపేటలో రాష్ట్ర పద్మశాలి సంఘానికి 2018 సంవత్సరంలో 2.5 ఎకరాల భూమిని కేటాయించగా, తాజాగా పద్మశాలి భవన నిర్మాణానికి రూ.5 కోట్ల నిధులు కేటాయించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంచిర్యాల జిల్లా భక్త మార్కండేయ పద్మశాలి స్వచ్ఛంద సేవా సంస్థ పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు బుధవారం నిర్వహించిన పద్మశాలి సంఘం సమావేశంలో హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతూ తీర్మానం చేశారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలోని 29 జిల్లా కేంద్రాలతో పాటు మండల కేంద్రాల్లోనూ పద్మశాలీల ఆత్మగౌరవ భవనాల నిర్మాణానికి ప్రభుత్వ స్థలాలు కేటాయించి, భవన నిర్మాణాలకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సమావేశం ద్వారా కోరారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నంబర్ 14ను వెంటనే ఉపసంహరించుకో వాలని డిమాండ్ చేశారు. బీసీలకు, ముఖ్యంగా పద్మశాలీలకు సంబంధించిన ఆత్మగౌరవ భవనాలపై ప్రభుత్వ పెత్తనం ఉండేలా ఈ జీవో ఉందని పేర్కొంటూ, దానిని రద్దు చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం నియమించే వివిధ కార్పొరేషన్ల చైర్మన్, డైరెక్టర్ పదవుల్లో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 10 శాతం జనాభా కలిగిన పద్మశాలీలకు తగిన ప్రాధాన్యత



కల్పించాలని ముఖ్యమంత్రిని కోరారు. పద్మశాలీలు యాచించే స్థాయి నుంచి శాసించే స్థాయికి ఎదగాలని, రాజకీయాలకు అతీతంగా సంఘటితమై తమ హక్కులను సాధించుకోవాలని సమావేశంలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా "జై పద్మశాలి.. జై బీసీ.. జై మార్కండేయ.. పద్మశాలీలారా రాజకీయాలకు అతీతంగా ఏకం కండి" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక, శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు, బీసీ సంఘాల నాయకుడు గజ్జెల్లి వెంకటయ్యతో పాటు జంజీరాల నారాయణ, అశోక్, వేముల చిప్ప రామస్వామి, ఆడిచర్ల రాజేశం, పరిష శ్రీనివాస్, రాందాస్, బొద్దున బాబురావు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిలో వైఎస్ జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన చింతూరు వైఎస్సార్‌సీపీ ప్రతినిధి బృందం

జడ్పీటీసీతో పాటు 12 ఎంపీటీసీ స్థానాల్లో 10 స్థానాలు కైవసం చేసుకున్న సందర్భంగా భేటీ





చింతూరు, నవంబర్ 11 మీ వార్త ప్రతినిధి : ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో చింతూరు మండలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించిన నేపథ్యంలో పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని చింతూరు మండల వైఎస్సార్‌సీపీ ప్రతినిధి బృందం బుధవారం తాడేపల్లిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసింది. చింతూరు మండలంలో జడ్పీటీసీ స్థానంతో పాటు మొత్తం 12 ఎంపీటీసీ స్థానాలకు గాను 10 స్థానాలను వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకున్న సందర్భంగా ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా ఎన్నికల ఫలితాలు, మండలంలో పార్టీ సాధించిన విజయాన్ని నాయకులు వైఎస్ జగన్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌ఛార్జి నాగులపల్లి ధనలక్ష్మి, చింతూరు మండల పార్టీ కన్వీనర్ వై. రామలింగారెడ్డి, నూతనంగా ఎన్నికైన జడ్పీటీసీ సభ్యురాలు సవలం అమల, చింతూరు ఎంపీపీగా ప్రమాణ స్వీకారం చేయనున్న చిచ్చుడి మురళి, మాజీ వైస్ ఎంపీపీ మేడేపల్లి శ్రీ సుధాకర్ చిన్ని, వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు కోట్ల కృష్ణ,మహిళా నాయకురాలు యగుమంటి శ్రీలత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండవ రోజు 5 దీపాలతో కార్తీక దీపోత్సవం



తాడేపల్లిగూడెం, నవంబర్ 11 (మీ వార్త ప్రతినిధి) తాడేపల్లిగూడెం, కార్తీక దీపోత్సవం కార్యక్రమంలో భాగంగా 2వ రోజు భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో ఐదు దీపాలతో పూజలు నిర్వహించారు. పళ్ళ వారుల శ్రీరామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో పూజా దీపోత్సవం నిర్వహించారు. శ్రీరామకృష్ణ శర్మ మంత్రోచ్చారణతో కార్తీక మాసంలో దీపం వెలిగించడం అంటేనే పుణ్యం. అందులో 5 దీపాలు వెలిగించడం అత్యంత విశేషమైనదని పురాణాలు చెబుతున్నాయి. ఈ 5 దీపాలు పంచభూతాలకు, పంచేంద్రియాలకు ప్రతీక అని , ఈ దీపం పితృదేవతల ఆశీస్సులు తెస్తుంది. పూర్వజన్మ పాపాలు తొలగిపోతాయి అని ఇంట్లో నెగెటివ్ శక్తి పోయి, పాజిటివ్ ఎనర్జీ వస్తుంది, 5 దీపాలు, 5 శక్తులు చీకటి పోయి, జ్ఞానజ్యోతి వెలిగే పండుగే కార్తీక దీపోత్సవం. కార్తీకంలో 5 దీపాలు వెలిగిస్తే - శివుడు, విష్ణువు, అమ్మవారు, గురువు, పితృదేవతల ఆశీస్సులు లభిస్తాయి అనే నమ్మకం కలుగుతుందని ఈ ఐదు దీపాలతో ఆయన భక్తులతో పూజలు ఘనంగా నిర్వహించారు. అనంతరం అయ్యప్ప మాల ధరించిన స్వామి భక్తులు వడి పూజా కార్యక్రమం భక్తిశ్రద్ధలతో చేశారు. ఈ కార్యక్రమంలో మారం వెంకటేశ్వరరావు ఐదు దీపాల పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులకు ప్రసాదాలను అందజేశారు.

విశ్వహిందూ పరిషత్ -- కృష్ణా జిల్లా

మహిళల సత్సంగం, భజన కార్యక్రమం -- లక్కీడిప్ ద్వారా అమ్మవారి నూతన వస్త్రాల బహూకరణ





సర్కిలపేట నవంబర్ 11(మీ వార్త ప్రతినిధి) విశ్వహిందూ పరిషత్ కృష్ణా జిల్లా ఆధ్వర్యంలో ఈరోజు సాయంత్రం 6.45 గంటలకు సర్కిలపేటలోని శ్రీ సంతాన వేణుగోపాలస్వామి వారి ఆలయంలో మహిళల సత్సంగం, భజన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో 24 మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భజనలు, సత్సంగం ద్వారా ఆధ్యాత్మిక భావాలను పంచుకున్నారు. అనంతరం విశ్వహిందూ పరిషత్ కృష్ణా జిల్లా అధ్యక్షులు అమ్మవారికి సమర్పించేందుకు బహూకరించిన నూతన వస్త్రాలను లక్కీడిప్ పద్ధతి ద్వారా ఎంపికైన శ్రీమతి పి. కృష్ణవేణి గారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు శ్రీ జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం, శ్రీ అయ్యప్ప, శ్రీ కూసపరెడ్డి శ్రీనివాసరావు, శ్రీ పి. శ్రీనివాసరావు, ఆలయ పూజారి శ్రీ శేషు, శ్రీ చి. లక్ష్మీనారాయణ, శ్రీ వి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. మహిళల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడం, భక్తి భావాన్ని విస్తరించడం, ధార్మిక కార్యక్రమాల్లో మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం. విశ్వహిందూ పరిషత్ -- కృష్ణా జిల్లా

పాలకుల పంచన చేరని సీఈసీ శేషన్!



దేశంలో కొన్నేండ్లుగా ఎన్నికల సంఘం వివాదాస్పదంగా మారిపోయింది. ఇప్పుడైతే బీజేపీకి తాబేదారుగా వ్యవహరిస్తున్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పార్టీకొక పాలసీ, రాష్ట్రానికొక విధానంతో ఈసీ తన స్థాయిని తానే భ్రష్టు పట్టించుకుంటున్నది. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో అవకతవకల వివాదంతో ఈసీ ఖ్యాతి పతనావస్థకు చేరింది. ఏకంగా ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పైనే ఏతీవ్రమైన ఆరోపణలు వస్తున్నాయి. ఆయన రాజీనామా కోరుతూ ఆందోళనలు ఉధృతంగా నడుస్తున్నాయి. కానీ ఈసీకి సంబంధించి ఈనాటి ఈ దుస్థితికి భిన్నమైన చిత్రం ఒకనాడు ఉండేది. వెన్నెముక లేని అధికారులు ఎన్నికలను భ్రష్టు పట్టిస్తున్న ఇలాంటి తరుణంలో సీఈసీ పదవికి వన్నె తెచ్చిన ఒక ప్రజాస్వామిక పరిరక్షకుడి గురించి తెలుసుకోవాల్సిన అవసరమున్నది. ఆయన మరెవరోకాదు, టీఎన్ శేషన్‌గా ప్రఖ్యాతిగాంచిన తిరునళ్లై నారాయణ అయ్యర్ శేషన్. నేడు ఆయన వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుడి కృషిని స్మరించుకుందాం. ఐఏఎస్‌అంటే 'అయ్యా.. ఎస్' అని తలూపడం కాదని రాజ్యాంగం కల్పించిన విశేషాధికారాలతో నిష్పక్షపాతంగా, నిర్భయంగా ప్రజల కోసమే పని చేయడం అని నిరూపించిన అధికారులు అరుదు. అందులో కేంద్ర ఎన్నికల సంఘం మాజీ ప్రధాన అధికారి టీఎన్ శేషన్ ముందువరుసలో ఉంటారు. రాజ్యాంగం విలువలను గౌరవిస్తూ అదేబాటలో పయనించారు. ఒత్తిళ్లకు లొంగకుండా సాహసోపేతమైన సంస్కరణలను అమలు చేసి, చరిత్రలో చిరస్థాయిగా నిలిచారు. ఎన్నికలంటే ఒక తంతు కాదని, అది ఒక గొప్ప బాధ్యత అని భావించి, లోపభూయిష్టమైన విధానాలను రూపుమాపారు. ఆ తర్వాత కాలంలో చాలామంది ఎన్నికల అధికారులకు మార్గదర్శిగా నిలిచారు. శేషన్ గురించి తెలుసుకుంటే అధికారులకు తమ పదవికున్న గొప్పదనం స్పష్టంగా అర్థమవుతుంది.

1990వ దశకం తొలినాళ్లలో కొందరు ఐఏఎస్ అధికారులు రాజకీయ నాయకుల బెదిరింపులకు భయపడి దిక్కుదోచని దశలో ఉన్న రోజులవి. అటువంటి సమయంలో రాజ్యాంగానికి కట్టుబడి ఉద్యోగ ధర్మం నిర్వహించే ఐఏఎస్‌లను ఏ రాజకీయ నాయకులు ఏమీ చేయలేరని నిరూపించారు టీఎన్ శేషన్. ఐఏఎస్‌లు తమ విలువల్ని మరిచినప్పుడు మాత్రమే రాజకీయ నాయకుల అడుగులకు మడుగులొత్తాల్సి వస్తుందని, విధి నిర్వహణలో నిజాయితీగా పని చేస్తే నిర్భయంగా ఉండొచ్చని తన ఆచరణ ద్వారా చాటిచెప్పారు. ఐఏఎస్ విశిష్టతను అర్థమయ్యేలా చూపెట్టారు. ఎందరో ఐఏఎస్‌లలో ఆత్మైస్థెర్యం, స్ఫూర్తిని నింపారు. కేంద్ర ఎన్నికల సంఘంలో పదో ఎన్నికల ప్రధానాధికారిగా నియమితుడైన ఆయన 1990 డిసెంబర్ 12 నుంచి 1996 డిసెంబర్ 11 వరకు పదవిలో కొనసాగారు. పదవిని స్వీకరించిన తొలినాళ్లలోనే ఎన్నికల విధానంలోని వంద అవకతవకలు, లోపాల్ని గుర్తించారు. ఓటర్ల జాబితాలు, పోలింగ్ స్టేషన్ల నిర్వహణలో లోపాలను సరిదిద్దాలని భావించారు. బెదిరించి ఓట్లు వేయించుకునే పద్ధతులు, నిబంధనలకు మించి ఖర్చు పెట్టే అభ్యర్థులపై కఠినంగా వ్యవహరించారు.

గూండాయిజంతో పోలింగ్ బూత్‌లను ఆక్రమించడం, అధికారుల పక్షపాత ధోరణి లాంటి అంశాలపై దృష్టి సారించారు. లోపాలను సరిచేయడంలో చాలా కఠినంగా వ్యవహరించారు. అంతేకాదు పారదర్శక ఎన్నికల నిర్వహణలో ఫొటో గుర్తింపు కార్డులు అత్యవసరమని ప్రతిపాదించారు. కొన్ని స్వార్థ రాజకీయ శక్తులు ఈ ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించాయి. తన ప్రతిపాదనకు సరైన ప్రతిస్పందన ప్రభుత్వం నుంచి రాకపోవడంతో ఫొటో గుర్తింపు కార్డులు లేకపోతే ఎన్నికలే నిర్వహించబోనని తేల్చిచెప్పారు. చివరికి సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలకు లోబడి మాత్రమే ఎన్నికలను నిర్వహించారు. శేషన్ పట్టుదల వల్లనే తర్వాతి కాలంలో ఫొటో గుర్తింపు కార్డులు అమల్లోకి వచ్చాయి.

1993లో పార్లమెంటుకు జరిగిన ఎన్నికల్లో అభ్యర్థులు తమ ప్రచార వ్యయ వివరాలను సమర్పించకపోవడంతో 1,488 మంది అభ్యర్థుల్ని మూడేండ్ల వరకు పోటీకి అనర్హులుగా ప్రకటించారు శేషన్. సుమారు 40,000 మంది ఆశావహ అభ్యర్థులు సమర్పించిన వివరాలను స్వయంగా పరిశీలించి, తప్పుడు వివరాలిచ్చినందుకు 14,000 మందిని పోటీకి అనర్హులుగా నిర్ధారించారు. తన కఠిన నిర్ణయాల వల్ల, ఎన్నో విమర్శలను ఎదుర్కొన్నారు. అయినా శేషన్ తన సంస్కరణలను కొనసాగించారు. తాను చట్టంలోని కామాలు, ఫుల్‌స్టాప్‌లను కూడా మార్చకుండా అమలు చేశానని అనేవారు. ప్రజాస్వామిక విలువల కోసం పాటుపడిన శేషన్ 2019 నవంబర్ 10న చెన్నైలోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. భౌతికంగా దూరమైనా ఆయన నెలకొల్పిన విలువలు ఎందరో అధికారులకు మార్గదర్శకాలయ్యాయి. శేషన్ బాటలో నడిచిన అధికారులు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు.

తీరు మారని ట్రంప్



ఇటీవల వెల్లడైన మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్లు దారుణంగా దెబ్బతిన్నా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వ్యవహారశైలి మారిన దాఖలా కనబడటం లేదు. ఎప్పటిలాగే పరస్పర విరుద్ధ సంకేతాలు పంపుతూ గందరగోళపరిచేందుకే ఆయన ప్రయత్నిస్తు న్నారు. తమ దాడులవల్ల ఇరాన్ సైనికంగా బలహీనపడిందనీ, ఇక యుద్ధం ముగిసిందనే అనుకుంటున్నాననీ మంగళవారం ఆయన ప్రకటించారు. ఆ ప్రాంత దేశాలైన ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈ, బహ్రెయిన్ తదితర దేశాల కోరికమేరకే కొత్త దాడులు చేయరాదన్న నిర్ణయం తీసుకున్నామన్నారు.

ఇరాన్ ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేశాం గనుక ఇక యుద్ధం అవసరం లేదని విదేశాంగ మంత్రి మార్కో రుబియో కూడా చెప్పారు. వినడానికి బాగానే అనిపించినా ఈ ప్రకటనల్లో ఎక్కడో తేడా ఉందని అందరికీ అర్థమవు తుంది. ఒకపక్క యుద్ధం ఇక ఉండబోదంటూనే ఓడరేవుల దిగ్బంధం కొనసాగిస్తామని ట్రంప్ అంటున్నారు. మాటలవరకూ ఆయన అయోమయం సృష్టిస్తున్నా, చేతలు ఆయనే మిటో చాటుతున్నాయి. ఇప్పటికీ రోజూ హార్మూజ్ జలసంధిలో చమురు నౌకలపై అమెరికా దాడులు చేస్తూనేవుంది. వాటికి జవాబుగా ఇరాన్‌వైపునుంచి ప్రతిఘటన కొనసాగుతోంది.

ఒమన్‌లో భాగమైన దీదామర్ దీవిలో చమురు స్మగ్లింగ్‌కు పాల్పడు తున్న శత్రు నౌకల్ని ధ్వంసం చేశామని ఇరాన్ తెలిపింది. ఇవన్నీ అమెరికా తరలించుకు పోతున్న ముడిచమురు ట్యాంకులే. ఆత్మరక్షణ కోసమంటూ ఇరాన్‌లోని కెషమ్ ద్వీపంపై అమెరికా దళాలు ఇటీవలే దాడులు జరిపాయి. ఈ యుద్ధానికి అనుబంధంగా మొదలైన లెబనాన్, యెమెన్ ఘర్షణలు కూడా యథావిధిగానే ఉన్నాయి. అమెరికా మాదిరే ఇజ్రాయెల్ సైతం లెబనాన్‌తో కుదిరిన ఒడంబడికను ఉల్లంఘిస్తూ నిత్యం దాడులు చేయటంవల్లే ఈ పరిస్థితి తలెత్తింది.

ఎనిమిది నెలల క్రితం ఇరాన్‌తో అనవసర కయ్యానికి దిగిన ట్రంప్ వల్ల ఆర్థిక వ్యవస్థ కనీవినీ ఎరుగని స్థాయిలో కష్టాలు ఎదుర్కొంటున్నది. ఇంధన ధరలు భారీగాపెరగటంతో, ఇతర నిత్యావసరాల ధరలు సైతం ఆకాశాన్నంటాయి. మొన్న ఆగస్టు తర్వాత తొలిసారి బ్రెంట్ ముడి చమురు బ్యారెల్ 90 డాలర్లకు పడిపోయింది. ట్రంప్ తాజా ప్రకటనే ఇందుకు కారణం. కానీ ఇలా అబద్ధాలతో ఎన్నాళ్లు ధరల్ని అదుపు చేయగలుగుతారు? అమెరికా దుందుడుకు చర్యలు, అది తరచు స్వరం మార్చటం వగైరాలన్నీ దశాబ్దాలుగా చూస్తున్న ఇరాన్‌ను ఇలాంటి మాయదారి ప్రకటనలు మోసపుచ్చలేవు.

ఆ దేశ విదేశాంగమంత్రి అబ్బాస్ అరఘూచి చెప్పినట్టు గౌరవప్రదమైన భాష, దౌత్యపరమైన చర్చలు, ఇన్నేళ్లుగా అమలు చేస్తూ వచ్చిన ఆంక్షల ఎత్తివేత, అమెరికా స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తుల విడుదల వంటివి మాత్రమే ఘర్షణలు నిలిచిపోవటానికి దోహదపడతాయి. ఇవన్నీ జరిగిన రెండు రోజుల్లోనే హార్మూజ్‌జలసంధిలో సాధారణ పరిస్థితులేర్పడతాయని కూడా అరఘూచి అన్నారు. ఈ ప్రతిపాదనలపై తన వైఖరేమిటో చెప్పకుండా, లక్ష్యం నెరవేరింది గనుక తదుపరి దాడులుండబోవని ట్రంప్ చెప్పటం ప్రజల్ని వంచించటమే.

రిపబ్లికన్లను జనం తిరస్కరించటానికి ఇరాన్ యుద్ధంతోపాటు ఇతర కారణాలు కూడా ఉన్నాయి. తన రెండో ఏలుబడి మొదలయ్యాక ట్రంప్ దేశంలో సకల వ్యవస్థలనూ నాశనం చేశారు. న్యాయవ్యవస్థను గుప్పెట్లో పెట్టుకోవడానికి ప్రయత్నించారు. జాతి విద్వేషాలను రెచ్చగొట్టారు. వలసదారులపై ఉక్కుపాదం మోపారు. సక్రమంగా దేశంలో ప్రవేశించినవారిని సైతం వేటాడారు. లైంగిక మైనారిటీ లను వేధించారు. అదనపుసుంకాల పేరిట అనేక దేశాలను దూరం చేసుకున్నారు. వీటన్నిటికీ బాధ్యుడు స్టీఫెన్ మిల్లర్. అలాంటి వ్యక్తిని తాజాగా ట్రంప్ పదోన్నతి కల్పించి, వైట్‌హౌస్ సిబ్బంది వ్యవహారాల చీఫ్‌గా నియమించారు.

ఆయనలో పరివర్తన రాలేదనీ, ఇరాన్ యుద్ధం గురించిన ప్రకటన కూడా మోసపూరిత ఎత్తుగడేననీ స్పష్టంగా తెలుస్తుంది. ఈరెండేళ్లూ ఎటూ ఆయన మైనారిటీ అధ్యక్షుడిగానే కాలం వెళ్లదీయాలి. అయినా తనవీటో అస్త్రాన్ని ఎడాపెడా ప్రయోగిస్తారు. ప్రతినిధుల సభలోనూ, సెనేట్‌లోనూ డెమాక్రాట్లు తమ ఆధిక్యతతో వీలైనమేర అడ్డుకుంటేనే ఈ వైపరీత్యాల తీవ్రతను కాస్తయినా తగ్గించటం సాధ్యమవుతుంది.

తెలుగు సాహిత్యంలో సరికొత్త అధ్యాయం..

తొలి మహిళా సహస్రావధానానికి రంగం సిద్ధం!

విజయవాడ: తెలుగు సాహిత్య చరిత్రలో ఒక సరికొత్త అధ్యాయానికి విజయవాడ నగరం వేదిక కానుంది. అత్యంత క్లిష్టమైన సాహిత్య ప్రక్రియగా పేరుగాంచిన "సహస్రావధానం"ను తొలిసారిగా ఒక మహిళ నిర్వహించబోతున్నారు. ప్రముఖ అవధాని బులుసు అపర్ణ ఈ చారిత్రక ఘట్టానికి శ్రీకారం చుట్టారు. డిసెంబరు 10 నుంచి జనవరి 3 వరకు మొత్తం 25 రోజుల పాటు పొట్టి శ్రీరాములు ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఈ అపూర్వ సాహిత్య యజ్ఞం జరగనుంది. మంగళవారం విజయవాడ కేబీఎన్ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హిందూ హైస్కూల్స్ కమిటీ జనరల్ కరస్పాండెంట్ గోపిశెట్టి మల్లయ్య, కేబీఎన్ కళాశాల కరస్పాండెంట్ టి.శ్రీనివాసు, అవధాని అపర్ణ ఈ వివరాలు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ప్రచార ప్రతులను ఆవిష్కరించారు. డిసెంబరు 10న ప్రముఖ అవధాన బ్రహ్మ మాడుగుల నాగఫణిశర్మ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. అనంతరం 25 రోజుల పాటు వివిధ దశల్లో అవధాన ప్రక్రియ కొనసాగుతుంది. జనవరి 3న జరిగే ముగింపు కార్యక్రమం, ధారణ, విజయోత్సవ సభకు సహస్రావధాని గరికిపాటి నరసింహారావు హాజరుకానుండటం విశేషం. ఈ సందర్భంగా అవధాని బులుసు అపర్ణ మాట్లాడుతూ.. "ఇప్పటివరకు 325కు పైగా అష్టావధానాలు, ఏడు శతావధానాలు, రెండు ద్విశతావధానాలు పూర్తి చేశాను. ఇప్పుడు గురువుల ఆశీస్సులతో సహస్రావధానానికి సిద్ధమయ్యాను. డిసెంబరు 10 నుంచి 22 వరకు సమస్యలు, దత్తపదులు, వర్ణన అంశాలను స్వీకరించి, 23 నుంచి వాటి పూరణలు చేస్తాను. జనవరి 3న 750 పద్యాల ధారణతో పాటు ఆశువద్యాలు, ఘంటావధానంతో కలిపి వెయ్యి పద్యాలను పూర్తి చేస్తాను" అని వివరించారు. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఈ కార్యక్రమాన్ని పీఎస్‌సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తెలుగు సాహితీ లోకంలో ఒక మహిళ ఒంటిచేత్తో సహస్రావధానం చేయడం ఇదే ప్రథమం కావడంతో ఈ కార్యక్రమంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇది తెలుగు భాషాభిమానులకు, సాహిత్య ప్రియులకు ఒక పండుగలా నిలిచిపోతుందని నిర్వాహకులు ధీమా వ్యక్తం చేశారు.

నామవరం స్వతంత్ర ఎంపిటీసి సభ్యుడు కొరిమి సూర్యారావు టీడీపీలో చేరిక



పాయకరావుపేట, నవంబరు 11 మీ వార్త ప్రతినిధి ప్రతినిధి) : మండలంలోని నామవరం ఎంపీటీసీ సభ్యుడు కొరిమి సూర్యారావు బుధవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. ఇటీవల జరిగిన పరిషత్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన సూర్యారావు 179 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. విశాఖపట్నంలోని హోం మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత పార్టీ కండువా వేసి కొరిమి సూర్యారావును తెలుగుదేశం పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు కురందాసు శివ, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చిన్నారుల సమగ్ర అభివృద్ధికి అంగన్ వాడీ కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ చూపాలి



పాయకరావుపేట, నవంబరు 11 (మీ వార్త ప్రతినిధి) : చిన్నారుల శారీరక, మానసిక, భాషా, సామాజిక, భావోద్వేగ అభివృద్ధికి అంగన్ వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషించాలని ఐసీడీఎస్ సూపర్వైజర్లు లలిత, రంజాన్ బీబీ సూచించారు. చిన్నారులకు నాణ్యమైన పూర్వ ప్రాథమిక విద్యతో పాటు పౌష్టికాహారం అందించడంలో అంగన్వాడీ కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు. నక్కపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పాయకరావుపేట మండలానికి చెందిన 71 మంది అంగన్వాడీ కార్యకర్తలకు నవంబర్ 10, 11 తేదీల్లో రెండు రోజులపాటు నిర్వహించిన "పోషణ్ భీ పఢాయీ భీ" శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 0 నుంచి 6 సంవత్సరాల వయస్సు గల చిన్నారుల సమగ్ర అభివృద్ధి, వయస్సుల వారీగా పిల్లల్లో చోటుచేసుకునే ఎదుగుదల దశలు, వారి అభివృద్ధి అవసరాలపై కార్యకర్తలకు అవగాహన కల్పించారు. చిన్నారుల్లో కనిపించే 21 రకాల అభివృద్ధి సంబంధిత ఇబ్బందుల లక్షణాలను ప్రారంభ దశలోనే గుర్తించి, తగిన చర్యలు తీసుకోవడం ద్వారా వారి సంపూర్ణ అభివృద్ధికి దోహదపడాలని సూచించారు. ఆటపాటల ద్వారా విద్యాబోధన, ప్రీస్కూల్ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించే విధానాలను వివరించారు. ముఖ్యంగా సున్నా నుంచి మూడు సంవత్సరాల వయస్సు గల పిల్లల అభివృద్ధిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం, గృహ సందర్శనల ప్రాధాన్యతను తెలియజేశారు. పిల్లల్లో అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించే బోధనా సామగ్రి తయారీ, వాటి వినియోగంపై ప్రత్యేక శిక్షణ అందించారు.

ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్లు లలిత, రంజాన్ బీబీతో పాటు పాయకరావుపేట మండలానికి చెందిన 71 మంది అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రయోజనం కొరకే కూటమి ఏర్పాటు

పెంటపాడు జడ్పిటిసి తనబుద్ధి రవికిరణ్



పెంటపాడు నవంబర్ 11 (మీ వార్త ప్రతినిధి) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రయోజనం కొరకే కూటమి ఏర్పడింది తప్ప, ఒక ఎంపీటీసీ కోసమో లేదా జడ్పిటిసి కోసమో ఏర్పడలేదని పెంటపాడు మండలం జడ్పిటిసి తనబుద్ధి రవికిరణ్ అన్నారు. బుధవారం జనసేన కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిందని, దాని నుండి తప్పించేందుకే జనసేన అధినేత పవన్ కళ్యాణ్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ప్రధాని నరేంద్ర మోడీతో సంప్రదించి కూటమిని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కూటమి ముఖ్య ఉద్దేశం రాష్ట్ర అభివృద్ధి, పోలవరం ప్రాజెక్టు, అమరావతి రాజధాని నిర్మాణం, రోడ్లను నిర్మించడం వంటి ముఖ్య కారణాలు ఉన్నాయన్నారు. అలాంటిది ఒక ఎంపీటీసీ కోసమో లేదా ఇతరత్ర కారణాల చేత విడిపోవడానికి కాదని బల్లగుద్ది చెప్పారు. కూటమి ధర్మం పాటించాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తనకు చెప్పారని ఆయన అన్నారు. ఎవరు వ్యక్తిగత దూషణలకు వెళ్ళొద్దని ఎమ్మెల్యే సూచించారు అన్నారు. తాను ఎమ్మెల్యే దగ్గర ఉన్న సందర్భంలో ఒక గ్రామానికి చెందిన టిడిపి, జనసేన కార్యకర్తలు వస్తే సర్పంచ్ అభ్యర్థిగా టిడిపికి సపోర్ట్ చేయాలని తన ముందే ఎమ్మెల్యే చెప్పినట్లు ఆయన మీడియాకు వివరించారు. తుఫాను ను సైతం లెక్కచేయకుండా ఎమ్మెల్యే ఎంపీటీసీ అభ్యర్థుల విజయం కోసం జోరు వానలో సైతం ప్రచారం చేశారని అందువల్లనే పెంటపాడులో 16,తాడేపల్లిగూడెంలో 17 మంది ఎంపీటీసీలు, ఇద్దరు జడ్పిటిసిలు గెలవగలిగామని ఆయన అన్నారు. 2024లో ఎమ్మెల్యేగా బొలిశెట్టి శ్రీనివాస్ కు 61% ఓట్లు వస్తే, ప్రస్తుతం పెంటపాడు జడ్పిటిసి గా తనకు 63% ఓట్లు రావడానికి ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి నిదర్శనం అని ఆయన తెలిపారు.



ఇండోనేషియాలో దూసుకుపోతున్న 'రామాయణం'!

దర్శకుడు నితేష్ తివారీ ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించిన పౌరాణిక చిత్రం 'రామాయణం: రైజ్ ఆఫ్ ఎ లెజెండ్' ఇండోనేషియాలో దూసుకుపోతుంది. జకార్తాలో జరిగిన ఈ సినిమా ప్రీమియర్‌కు భారీ సంఖ్యలో ప్రేక్షకులు తరలివచ్చారు. సాంప్రదాయ భారతీయ దుస్తులు ధరించి ప్రేక్షకులు థియేటర్ల వద్ద సందడి చేసిన వీడియోలు, ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మరోవైపు, థాయ్‌లాండ్‌లోనూ ఈ సినిమా జోరు కొనసాగుతోంది. అక్కడ విడుదలైన ఐదు రోజుల్లోనే రూ. 5.15 కోట్లకు పైగా వసూలు చేసి, ఒక భారతీయ చిత్రానికి సంబంధించి రికార్డు సృష్టించింది. బాక్సాఫీస్ రిపోర్టుల ప్రకారం, థాయ్‌లాండ్‌లో నవంబర్ 5న విడుదలైన ఈ చిత్రం సుమారు ฿550,000 (సుమారు రూ. 5.15 కోట్లు) రాబట్టింది. ఇక నవంబర్ 11న ఇండోనేషియాలోనూ ఈ చిత్రం ఘనంగా విడుదలైంది. జకార్తాలో జరిగిన ఈ ప్రీమియర్ షో సందర్భంగా అభిమానులు రెడ్ కార్పెట్ పై నడుస్తూ, గాజులు కొనుగోలు చేస్తూ, మెహందీ పెట్టుకుంటూ సందడి చేశారు. రాముడు, సీత, లక్ష్మణుడు, రావణాసురుల వేషధారణలో ఉన్న కళాకారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మహర్షి వాల్మీకి రామాయణం, అద్భుత రామాయణం అలాగే తులసీదాస్ రచించిన రామచరితమానస్ ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రంలో రణబీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా, యశ్ రావణాసురుడిగా నటించారు. ఇండోనేషియాలో ప్రాచీన జావానీస్ అనువాదమైన 'కకావిన్ రామాయణం' ద్వారా, అలాగే థాయ్‌లాండ్‌లో 'రామకీయెన్' రూపంలో ఈ ఇతిహాసానికి ఉన్న గాఢమైన సాంప్రదాయ సంబంధాల వల్ల ఇక్కడ ఈ చిత్రానికి విశేషమైన ఆదరణ లభిస్తోంది. మరోవైపు ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ వద్ద ఈ చిత్రం దూసుకుపోతోంది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, కేవలం ఆరు రోజుల్లోనే ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ. 800 కోట్లకు పైగా వసూలు చేసింది. భారతదేశంలో హిందీ, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదలైన ఈ చిత్రం, డొమెస్టిక్ మార్కెట్‌లో ఆరు రోజుల్లో రూ. 52.50 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించి, ప్రపంచవ్యాప్తంగా మొత్తం రూ. 823.50 కోట్ల మార్క్‌ను దాటింది. నమిత్ మల్హోత్రాకు చెందిన ప్రైమ్ ఫోకస్, యశ్ యొక్క మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మించిన ఈ చిత్రంలో రవి దూబే లక్ష్మణుడిగా నటించారు. కాగా, ఈ చిత్రంలోని పోస్ట్-క్రెడిట్ సీన్‌తో పాటు, సన్నీ డియోల్ హనుమంతుడిగా పరిచయమయ్యే 'హనుమాన్ చాలీసా' మ్యూజిక్ వీడియోను కూడా చిత్ర యూనిట్ విడుదల చేసింది.

'దాదా'లో సింగర్‌గా మారిన బాలయ్య..
'దాదా ధమాకా'లో నందమూరి నటసింహం స్పెషల్ ట్రీట్!



నందమూరి బాలకృష్ణ అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్ వచ్చేసింది. వరుస విజయాలతో జోరు మీదున్న బాలయ్య.. ఇప్పుడు తన తదుపరి చిత్రం 'దాదా'తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. డిసెంబర్ 24, 2026న క్రిస్మస్ కానుకగా ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ క్రమంలో సినిమా నుంచి విడుదల కానున్న తొలి పాటకు సంబంధించిన ఆసక్తికరమైన విషయం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ సినిమాలో బాలకృష్ణ కేవలం నటించడమే కాకుండా తన గొంతును కూడా వినిపించనున్నారనే వార్త అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది. 'దాదా' సినిమా నుంచి నవంబర్ 13, 2026న తొలి పాట 'దాదా ధమాకా' విడుదల కానుంది. టైటిల్‌కు తగ్గట్టుగానే ఈ పాటను ఫుల్ మాస్ ఎనర్జీతో రూపొందించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఈ పాటలో బాలకృష్ణ తనదైన స్టైల్‌లో స్టెప్పులు వేయనుండటం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. బాలయ్యతో పాటు బాలీవుడ్ బ్యూటీ నోరా ఫతేహి కూడా ఈ పాటలో సందడి చేయనున్నారు. నోరా ఫతేహి తన అద్భుతమైన డ్యాన్స్‌తో ఇప్పటికే దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఆమె డ్యాన్స్‌కు బాలయ్య మాస్ గ్రేస్ తోడైతే అభిమానులకు పండగే అని చెప్పాలి. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో రాబోతున్న పాట ఎలా ఉండబోతోందనే ఆసక్తి ఇప్పుడు అందరిలోనూ నెలకొంది. నవంబర్ 13న విడుదల కానున్న ఈ సాంగ్ సినిమాపై అంచనాలను మరింత పెంచే అవకాశం ఉంది. ఇక ఈ పాటకు సంబంధించి మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. బాలకృష్ణ స్వయంగా కొన్ని లైన్స్ పాడారట. సాధారణంగా తనదైన నటన, డైలాగ్ డెలివరీ, మాస్ యాక్షన్‌తో ప్రేక్షకులను అలరించే బాలయ్య.. ఈసారి గాయకుడిగానూ అభిమానులను సర్‌ప్రైజ్ చేయబోతున్నారు. సినిమాలోని పాట కోసం ఆయన కొన్ని పంక్తులు ఆలపించగా, అవుట్‌పుట్ విషయంలో చిత్రబృందం సంతోషంగా ఉన్నట్లు సమాచారం.దీంతో బాలకృష్ణ గొంతులో వచ్చే ఆ ప్రత్యేకమైన లైన్స్ వినేందుకు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. గతంలోనూ పలువురు స్టార్ హీరోలు తమ సినిమాల్లో పాటలు పాడి ప్రేక్షకులను అలరించారు. ఇప్పుడు బాలయ్య కూడా 'దాదా' కోసం తన గొంతును వినిపించనుండటం ఈ సినిమాకు మరో ప్రత్యేక ఆకర్షణగా మారనుంది. ముఖ్యంగా 'దాదా ధమాకా' పాటలో బాలయ్య పాడిన లైన్స్‌ను హైలైట్ చేయాలని చిత్రబృందం భావిస్తున్నట్లు తెలుస్తోంది. పాట విడుదలైన తర్వాత ఈ అంశం అభిమానుల్లో మరింత చర్చనీయాంశమయ్యే అవకాశం ఉంది. !



పాన్ ఇండియా హీరోగా శ్రీకాంత్ తనయుడు.. షూటింగ్ ప్రారంభం



పెళ్లిసందడి, ఛాంపియన్ మూవీస్‌తో హీరోగా గుర్తింపు తెచ్చుకున్న శ్రీకాంత్ తనయుడు రోషన్ మేకా. తాజాగా మరో మూవీకి సిద్ధమయ్యారు. రోషన్ హీరోగా భారీ సూపర్ హీరో అడ్వెంచరస్ మూవీని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాకు ఇంద్రగంటి మోహనకృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని అశోక క్రియేషన్స్ బ్యానర్‌పై పాన్ ఇండియాస్థాయిలో అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించనున్నారు. తాజాగా ఈ భారీ అడ్వెంచరస్ మూవీ పూజా కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో గ్రాండ్‌గా నిర్వహించారు. ఈ ఈవెంట్‌కు శ్రీకాంత్ హాజరై ముహుర్తపు షాట్‌కు క్లాప్ కొట్టారు. ఈ చిత్రంలో రేఖా పాండే, వినయ్ రాయ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ డిసెంబర్ మొదటి వారంలో ప్రారంభం కానుంది.

మెగాస్టార్ ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్.. సైలెంట్‌గా పనులు పూర్తి చేస్తున్న వశిష్ఠ!

మెగాస్టార్ చిరంజీవి హీరోగా తెరకెక్కుతున్న భారీ సోషియో ఫాంటసీ చిత్రం 'విశ్వంభర' గురించి గత కొంతకాలంగా రకరకాల వార్తలు వినిపిస్తున్నాయి. బింబిసార ఫేమ్ వశిష్ఠ మల్లిడి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాపై మొదట్లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. అయితే షూటింగ్, గ్రాఫిక్స్, ఇతర నిర్మాణానంతర కార్యక్రమాల కారణంగా సినిమా విడుదల ఆలస్యమవుతూ వస్తోంది. ఇప్పటివరకు విడుదల తేదీపై స్పష్టత లేకపోవడంతో మెగా అభిమానుల్లో కొంత నిరాశ నెలకొంది. ఈ నేపథ్యంలో తాజాగా సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన అప్‌డేట్ బయటకు వచ్చింది. చిత్రంలో నటిస్తున్న నటుడు ప్రవీణ్ కుమార్ సోషల్ మీడియాలో షేర్ చేసిన ఓ ఫొటోతో 'విశ్వంభర' పనులు ప్రస్తుతం ఏ దశలో ఉన్నాయో వెల్లడైంది. 'విశ్వంభర' సినిమా పరిస్థితి ఏమిటి? షూటింగ్ పూర్తయిందా? పోస్ట్ ప్రొడక్షన్ పనులు ఎక్కడి వరకు వచ్చాయి? అనే సందేహాలు చాలాకాలంగా అభిమానులను వెంటాడుతున్నాయి. ఈ ప్రశ్నలకు సమాధానమిచ్చేలా నటుడు ప్రవీణ్ కుమార్ తాజాగా డబ్బింగ్ సెషన్‌కు సంబంధించిన ఫొటోను సోషల్ మీడియాలో పంచుకున్నారు. దీంతో ఆయన ఈ సినిమాలో భాగమనే విషయం మరోసారి స్పష్టమైంది. అంతేకాకుండా సినిమా నిర్మాణానంతర కార్యక్రమాలు కూడా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.ఎలాంటి హడావుడి లేకుండా చిత్రబృందం సైలెంట్‌గా పనులు పూర్తి చేస్తున్నట్లు ఈ పరిణామం సూచిస్తోంది. ముఖ్యంగా డబ్బింగ్ కార్యక్రమాలు జరుగుతున్నాయనే విషయం అభిమానులకు కొంత ఊరటనిచ్చింది. అయితే సినిమా విడుదల తేదీపై మాత్రం ఇంకా అధికారిక ప్రకటన రాలేదు. ఈ సినిమాలో మెగాస్టార్ చిరంజీవికి జోడీగా అందాల తార త్రిష కృష్ణన్ నటిస్తున్నారు. వీరిద్దరి కాంబినేషన్‌లో గతంలో వచ్చిన సినిమాలు ప్రేక్షకులను అలరించడంతో 'విశ్వంభర'లో వీరి జంట ఎలా ఉండబోతోందనే ఆసక్తి నెలకొంది. ఇక ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు కునాల్ కపూర్, ఆశికా రంగనాథ్, రమ్య పసుపులేటి, ఈషా చావ్లా, ఆశ్రిత వేముగంటి నందూరి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. విభిన్నమైన పాత్రలు, భారీ తారాగణంతో ఈ సినిమాను రూపొందిస్తున్నారు. 'బింబిసార' సినిమాతో దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న వశిష్ఠ మల్లిడి.. ఇప్పుడు చిరంజీవితో 'విశ్వంభర' వంటి భారీ సోషియో ఫాంటసీ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. సాధారణ కమర్షియల్ సినిమాలకు భిన్నంగా అద్భుతమైన ప్రపంచం, మాయాజాలం, ఫాంటసీ అంశాలు, భారీ విజువల్ ఎఫెక్ట్స్‌తో ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

ఆ ఆలోచనలు ఒత్తిడి పెంచాయి: మౌళి తనూజ్ ప్రశాంత్



"నా తొలి చిత్రం 'లిటిల్ హార్ట్స్' మంచి విజయం సాధించింది. కానీ ఆ విజయం నాలో ఒత్తిడి పెంచింది. ఆ సినిమా విజయం తర్వాత నేను చాలా కథలు విన్నాను. అయితే సరైన కథలనే ఎంచుకుంటున్నానా? నా జడ్జ్‌మెంట్ కరెక్టేనా? అనే ఆలోచనలు నాలో ఒత్తిడి పెంచాయి. అయితే నాకు కొత్త కథలు చెబుతూనే, ఎంటర్‌టైనింగ్ సినిమాలు చేయాలని ఉంది" అని మౌళి తనూజ్ ప్రశాంత్ అన్నారు. మౌళి తనూజ్ ప్రశాంత్, సుష్మితా శెట్టి హీరో హీరోయిన్లుగా నటించిన క్రైమ్ కామెడీ ఎంటర్‌టైనర్ సినిమా 'డీఎన్‌కే'. శ్రీను కంబాల దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 13న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో మౌళి తనూజ్ మాట్లాడుతూ-- "ఈజీ మనీకి అలవాటు పడ్డ ఓ కుర్రాడు గ్యాంబ్లింగ్ చేస్తే డబ్బులు వస్తాయని ఆ మార్గాన్ని ఎంచుకుంటాడు. కానీ అతను తీసుకునే నిర్ణయాల వల్ల అప్పుల్లో కూరుకుపోతాడు. ఆ అప్పుల నుంచి బయటపడటానికి ఒక దొంగతనం చేస్తాడు. ఆ తర్వాత ఆ కుర్రాడు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది? ఆ కష్టాల నుంచి ఎలా బయటపడ్డాడు? అన్నదే ఈ సినిమా కథ. కథలో క్రైమ్ ఎలిమెంట్ ఉన్నప్పటికీ మంచి ఫన్ కూడా ఉంది. సెకండాఫ్‌లో ఒక సర్‌ప్రైజింగ్ సాంగ్ కూడా ఉంటుంది. సింజిత్ మంచి మ్యూ జిక్ ఇచ్చాడు. ఇక సెన్సార్ వాళ్లు అభ్యంతరం చెప్పడంతో మా సినిమా టైటిల్‌ను 'డీఎన్‌కే'గా మార్చాం. నాకు దర్శకత్వంపై ఆసక్తి ఉంది. కానీ ఇది పెద్ద బాధ్యత కాబట్టి కాస్త సమయం పడుతుంది" అని అన్నారు.